





Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 281 | ఆదివారం 26 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- ఉఖ్రూల్‌లో కాల్పుల ఘటనలలో ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు



2

## నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా బీజేపీ ఎమ్మెల్యే అశోక్ లాహిరి

- ఆయనతో పాటు ఐదుగురు సభ్యుల నియామకం
- పశ్చిమ బెంగాల్ ఎన్నికల కోసమేనా?



2

## రాష్ట్రీయ సరెండర్ సంఘ్‌గా మారిపోయింది

- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



భారత్ - అమెరికా సంబంధాల విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్రీయ సరెండర్ సంఘ్‌గా మారిపోయిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఇరు దేశాల సంబంధాలపై బిజెపి మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ చేసిన ప్రకటన నేపథ్యంలో ఆయన

- మిగతా 2లో..



## ముస్లిం మహిళలు మసీదుల్లోకి వెళ్లడంపై ఆంక్షల్లేవు

- సుప్రీంకు తెలిపిన ముస్లిం పర్సనల్ లా బోర్డు


న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

మసీదుల్లో నమాజ్ చేసుకోవడానికి మహిళలను అనుమతించడంపై ఇస్లాంలో ఎలాంటి ఆంక్షలు లేవని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. మసీదుల్లో ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతి కోరుతున్న మహిళలకు ఇదొక గొప్ప పరిణామం. శబరిమల కేసును

- మిగతా 2లో..

# జల జగడాలు వద్దు

- తెలుగుజాతి ప్రయోజనాలే ముఖ్యం
- 2027 మార్చిలోగా 'పోలవరం' పూర్తి
- రాయవరం సభలో ఏపీ సీఎం చంద్రబాబు
- రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ




రాజమహేంద్రవరం - సూర్య వాస్తవం

'సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దు... గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదు... తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తయితే ఆ నీళ్లు తెలంగాణ కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత రాయవరం గ్రామంలో సర్వే చేసిన పంట భూములను పరిశీలించారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావులేకుండా రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామన్నారు.

రీసర్వే పూర్తి అయిన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల

- మిగతా 2లో..



## 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఈ నెల 28 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర బడ్జెట్‌ను పార్ల మెంట్‌కు సమర్పించనున్నారు. జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారని అధికారులు శుక్రవారం తెలిపారు. పార్లమెంటరీ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ తాత్కాలికంగా ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసిందని చెప్పారు. ప్రతి ఏటా పార్లమెంట్ మొదటి సమావేశం మొదటి రోజున రాష్ట్రపతి ప్రసంగించడం ఆనవాయితీగా వస్తోంది. బీటింగ్ రిట్రీట్ ఉత్సవం కారణంగా 29వ తేదీన ఉభయ సభలు సమావేశం కావు. తిరిగి 30వ తేదీన పార్లమెంట్ సమావేశమవు తుంది, ఆ రోజున ఆర్థిక సర్వే ప్రవేశపెడతారు. మళ్లీ 31వ తేదీన ఉభయ సభలు సమావేశం కావు,

- మిగతా 2లో..

## ప్రజాస్వామ్య సూత్రాలకు బీజేపీ పాతర

-- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ విమర్శ



2

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ

- 2047 నాటికి ఈ రంగంలో ప్రపంచాన్ని శాసిస్తాం
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1ను శ్రీహరికోటకు జెండా ఊపి పంపిన సీఎం



హైదరాబాద్ - సూర్య వాస్తవం

దేశంలో ఏరోస్పేస్ హబ్‌గా తెలంగాణ అవతరించనుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ తయారు చేసిన భారతదేశపు తొలి ప్రయివేటు ఆర్బిటల్

- మిగతా 2లో..

## రీపోలింగ్‌కు ఆదేశించలేదు : ఈసీ



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

పశ్చిమ బెంగాల్ తొలి విడత, తమిళనాడు ఎన్నికల పోలింగ్ పూర్త యిన తరువాత ఎక్కడా రీపోలింగ్‌కు ఆదేశించలేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రక టించింది. పశ్చిమ బెంగాల్‌లో 600 మందికి పైగా అభ్యర్థులు, తమిళ నాడులో 1825 మంది అభ్యర్థులు లేదా వారి ప్రతి నిదుల సమక్షంలో శుక్రవారం పరిశీ లన పూర్తయిందని పేర్కొంది. పోలిం గ్ కేంద్రాల రికార్డుల పరి శీలన అనంతరం ఎక్కడా రీపో లింగ్‌కు సిఫార్సు

- మిగతా 2లో..




## హైకోర్టుకు తొలి మహిళా సీజే

- జస్టిస్ లీసా గిల్‌తో ప్రమాణం చేయించిన గవర్నర్

అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్ర హైకోర్టు చరిత్రలో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమెతో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పనిచేశారు. ఆయన పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో జస్టిస్ లీసా గిల్ నూతన సిజెగా నియమితులయ్యారు. విజయవాడ లోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమెతో గవర్నరు ప్రమాణ స్వీకారం

- మిగతా 2లో..

# మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

ఇంఫాల్ – సూర్య వాస్తవం

మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉఖ్రూల్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేలు కాల్పుల ఘటనల్లో ముగ్గురు మరణించారు. ఈ ఘటనలు టాంగ్‌ఖుల్ నాగాలు, కుకీ సముదాయాల మధ్య కొనసాగుతున్న ఘర్షణలకు తాజా ఉదాహరణగా నిలిచాయి. పోలీసులు వెల్లడించిన సమాచారం ప్రకారం.. మొదటి కాల్పుల ఘటన సినాకైథీ గ్రామం సమీపంలో జరిగింది. టాంగ్‌ఖుల్ నాగా, కుకీ సముదాయాలకు చెందిన సాయుధుల మధ్య జరిగిన ఈ కాల్పుల్లో హౌర్షోక్మి జమాంగ్ (29) అనే టాంగ్‌ఖుల్ వ్యక్తి మర ణించాడు. ఈ ఘటనలో మరో ముగ్గురు గాయపడ్డారు. ఇంకో కాల్పుల ఘటన ముల్లామ్ గ్రామంలో చోటు చేసుకుంది. ఇది కుకి జనాభా ఎక్కువగా ఉండే గ్రామం. ఈ కాల్పుల్లో లెట్‌లాల్ సిట్‌లోహా (జేమ్స్ కుకి), షావోమిన్‌లున్ హౌలావో (హిట్‌లాల్ కుకి) అనే ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. టాంగ్‌ఖుల్ నాగా సంస్థల ప్రకారం.. కుకి మిలి టెంట్ గ్రూపులు గ్రామాల మధ్య తరచూ తిరుగుతూ సమస్యలు సృష్టిస్తున్నాయని ఆరో పించాయి. తాము గస్తీ చేస్తున్న సమయంలో తమపై దాడి జరిగిందని వివరించాయి. అయితే టాంగ్‌ఖుల్ మిలిటెంట్లు ఉదయం 5.30 గంటలకు తమ గ్రామంపై దాడి చేశా రని ముల్లామ్ గ్రామాధికారులు ఆరోపించారు. కుకి హ్యూమన్‌రైట్ సంస్థలు ఈ ఘటనను ఖండించాయి. గ్రామ వాలంటీర్లను హత్య చేయడమే కాకుండా ఇండ్లను దహనం చేసినట్టు ఆరోపించాయి.

## రాష్ట్రీయ సరెండర్ సంఘ్‌గా

# మారిపోయింది

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. 'రాష్ట్రీయ సంఘ్ లొంగిపోయింది. నాగ్‌పూర్‌లో ఫర్జీ జాతీయవాదం. అమెరికాలో పచ్చి దాస్య స్వభావం. రామ్‌మాధవ్ మాత్రమే సంఘ్ నిజస్వరూపాన్ని బయటపెట్టారు' అని పేర్కొన్నారు. ఇరాన్, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేసేందుకు భారత్ అంగీకరించడంపై రామ్‌మాధవ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్‌గాంధీ ఈ పోస్టు చేశారు. ప్రపంచ వేదికపై భారత్ తన స్వతంత్ర స్వరాన్ని కోల్పోయిందని, ఈ లొంగుబాటుతో ప్రధానిగా కొనసాగే అర్హతను నరేంద్రమోడీ కోల్పోయారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు.

## 28 నుంచి పార్లమెంట్

# బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇక ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం నాడు కేంద్ర బడ్జెట్‌ను సభకు సమర్పించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియచేసే తీర్మానంపై చర్చ, కేంద్ర బడ్జెట్‌పై చర్చ అనంతరం పార్లమెంట్ సమావేశాలు ఫిబ్రవరి 13న వాయిదా పడతాయి. తిరిగి మార్చి 9వ తేదీన పార్లమెంట్ సమావేశమవుతుంది, ఏప్రిల్ 2 గురువారం నాడు సమావేశాలు ముగుస్తాయి. సాధారణంగా 3వ తేదీ శుక్రవారం వాయిదా పడాల్సి వుంది. అయితే ఆ రోజు గుడ్‌ఫ్రైడే తర్వాత వారాంతం కావడంతో ఏప్రిల్ 2నే ముగించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. బడ్జెట్ సమావేశాల్లో విరామం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల పద్దులను పరిశీలించడానికి శాఖాపరమైన స్థాయీ సంఘాలకు ఉపయోగపడుతుంది.

## ముస్లిం మహిళలు మసీదుల్లోకి వెళ్లడంపై

# ఆంక్షల్లేవు

(మొదటి పేజీ తరువాయి)

విచారిస్తున్న, చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఎదుట ముస్లిం పర్సనల్ లా బోర్డు తరపున సీనియర్ న్యాయవాది ఎం.ఆర్.షంషాద్ పై విషయం తెలియజేశారు. శబరిమల కేసుతో ముస్లిం మహిళల పిటిషన్లను కూడా జతపరిచారు. ఎందుకంటే ఆ పిటిషన్లు కూడా 25, 26 అధికరణలకు సంబంధించి రాజ్యాంగపరమైన ప్రశ్నలను కలిగివున్నాయి. మసీదుల్లో మహిళల ప్రవేశంపై ఇస్లామ్ ఎలాంటి నిషేధం విధించలేదని, సామూహిక ప్రార్థనల్లో పాల్గొనడమనేది తప్పనిసరి కాదని షంషాద్ పేర్కొన్నారు. మహిళలు మసీదులకు వెళ్లవచ్చా అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఈ అంశంపై ఇస్లామిక్ సూత్రాల్లో విస్తృత అంగీకారం వుందని షంషాద్ చెప్పారు. మహిళలు మసీదుకు రాకుండా ఆపవద్దు అని స్వయంగా మహ్మద్ ప్రవక్త చెప్పారని, ఈ విషయంలో స్పష్టత వుందని తెలిపారు.

# జల జగడాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా నిర్వహించే అదృష్టం తనకు దక్కిందన్నారు. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఏటా మూడు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, ఇందులో 300 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల రూ.వెయ్యి కోట్లతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాల్సి వస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో నీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారని విమర్శించారు.కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలిస్తామన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికే రెండేళ్లు పట్టిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పిపిపిలో కడుతుంటే ముద్దు కానీ, పిపిపి కింద మెడికల్ కాలేజీలు కడితే వద్దంటున్నారని విమ ర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. ట్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు. ట్రూ డౌన్ పేరుతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించామన్నారు. రూ.4,500 కోట్లు పెంచుకోమని ఇఆర్‌సి అను మతి ఇస్తే, ప్రజాప్రయోజనాల దృష్ట్యా వద్దని చెప్పామని తెలిపారు. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలు పెంచబోమని మరోమారు స్పష్టం చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పేరిట సుపరిపాలన అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. జగ్గన్నపేట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించామన్నారు. సంక్రాంతికి కోడి పందేలు సంప్రదా యమే కానీ, జూదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అమలా పురం ఎంపీ జి.హరీష్‌మాథూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా

# బీజేపీ ఎమ్మెల్యే అశోక్ లాహిరి

- ఆయనతోపాటు ఐదుగురు సభ్యులనియామకం
- పశ్చిమ బెంగాల్ ఎన్నికల కోసమేనా?

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యే అశోక్ లాహిరి నియామక మయ్యారు. ఆయనతో పాటు నిటి ఆయోగ్ సభ్యులుగా గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి చెందిన గోబర్ధన్ దాస్, క్యాబినెట్ మాజీ కార్యదర్శి రాజీవ్ గౌబా, ప్రొఫెసర్ కెవి రాజు, ప్రొఫెసర్ అభరు కరంధేకర్, డాక్టర్ ఎం. శ్రీనివాస్ నియామకం అయ్యారు. నిటి ఆయోగ్‌ను పునర్వ్యవస్థీకరిస్తూ కేంద్ర మంత్రివర్గ సెక్రెటేరియట్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్ సుమన్ బెరీ స్థానంలో అశోక్ కుమార్ లాహిరి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక సలహాదారుగా కూడా పని చేశారు. 15వ ఆర్థిక సంఘ సభ్యుడిగానూ పని చేశారు. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్, ఆసియా డెవలప్ మెంట్ బ్యాంక్ (ఏడీబీ)ల్లో కూడా పని చేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో విద్యను అభ్యసించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లోని బలుఘాట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు.అదే విధంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రముఖ ఇమ్యునాలజిస్ట్, విద్యావేత్త గోబర్ధన్ దాస్ నిటి ఆయోగ్ సభ్యుడిగా నియామకం అయ్యారు. ఈయన 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. గతంలో భోపాల్ ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్‌గా, జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పని చేశారు.

రాజీవ్ గౌబా క్యాబినెట్ మాజీ సెక్రెటరీగా పని చేశారు. ఈయన దీనికి ముందున్న నిటి ఆయోగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయనను కేంద్ర ప్రభుత్వం తిరిగి నియమించింది. ప్రొఫెసర్ కెవి రాజు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడిగా, ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారు కౌన్సిల్‌లో పార్ట్ టైం సభ్యుడిగా ఉన్నారు. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అభరు కరంధేకర్ ఉన్నారు. డాక్టర్ ఎం.శ్రీనివాస్ 2016–22 వరకు హైదరాబాద్‌లోని ఈఎస్ఐ హాస్పటల్ అండ్ మెడికల్ కాలేజ్ డీన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2022 సెప్టెంబర్ నుంచి ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ గా ఉన్నారు. నిటి ఆయోగ్ సభ్యులకు ప్రధాని, నిటి ఆయోగ్ చైర్మెన్ మోడీ శుభాకాంక్షలు తెలిపారు. నిటి ఆయోగ్‌కు మరింత పదును పెట్టాలని సూచించారు. ఫలవంతం, ప్రభావంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విధాన రూపకల్పనలో నిటి ఆయోగ్ కీలకమైన స్తంభంగా మారిందని తెలిపారు. ఇది సహకారం, సమాఖ్యవాదాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ముందుకు నడుపుతుందని, ఆర్థిక వ్యవస్థకు ఓ చుక్కానిగా మార్చిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో వినూత్న, దీర్ఘకాలిక వ్యూహాత్మక ఆలోచనలకు నిటి ఆయోగ్ ఓ సమగ్ర, సమర్థ వేదిక అని పేర్కొన్నారు.

**ప్రణాళిక సంఘం మార్పు పాలనలో కీలక మార్పు: అశోక్ కుమార్ లాహిరి**

నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్ అశోక్ కుమార్ లాహిరి, సభ్యుడు గోబర్ధన్ దాస్ శనివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ లాహరి మాట్లాడుతూ ”నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్‌గా ప్రధాని మోడీతో నా మొదటి సమావేశం జరిగింది. ఆయనకు నా ధన్యవాదాలు. నాపై నమ్మకం ఉంచినందుకు ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి నా కృతజ్ఞతలు” అని అన్నారు. ప్రణాళికా సంఘాన్ని మార్చాలన్న ప్రధాని నిర్ణయం పాలనలో ఒక కీలక మార్పు అని తెలిపారు. ”ప్రధాని మోడీ ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో నిటి ఆయోగ్‌ను ఏర్పాటు చేస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. నిటి ఆయోగ్ చేసే పని ఏమిటంటే, అది విధానాలను రూపొందిస్తుంది. వాటి అమలును పర్యవేక్షిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది” అని ఆయన అన్నారు. సంస్థ పనితీరు ”నిటి ఆయోగ్ నీతి, నిష్ఠ, నియత్ అనే మూడు ఎన్‌లపై ఆధారపడి ఉంది. ఈ మూడు ఎన్‌లు ఉంటే మనం విజయం సాధిస్తాం. 'డేటా ఆధారిత ప్రణాళిక'పై గట్టిగా దృష్టి సారించాల్సి ఉందని పేర్కొన్నారు.

**పశ్చిమ బెంగాల్ ఎన్నికల కోసమే**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ నియామకాలను పశ్చిమబెంగాల్ ఎన్నికల కోసమే అని చర్చ జరుగుతోంది. పశ్చిమ బెంగాల్ రెండో విడత పోలింగ్ ఈ నెల 29న జరగనుంది. ఈ నేపథ్యంలో నిటి ఆయోగ్ వైస్ చైర్మెన్, సభ్యుల నియామకాల్లో పశ్చిమ బెంగాల్ కు పెద్ద పీట వేశారు. తద్వారా ఓట్లను రాబట్టుకోవచ్చని బీజేపీ యోచిస్తోంది. నిటి ఆయోగ్‌లో కీలకమైన వైస్ చైర్మెన్ తోపాటు, ఒక సభ్యుడిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారిని నియమించింది. వైస్ చైర్మెన్ అశోక్ కుమార్ లాహిరి, సభ్యుడు గోబర్ధన్ దాస్ పశ్చిమ బెంగాల్ కు చెందినవారే. లాహిరి ప్రస్తుత బీజేపీ ఎమ్మెల్యేగా ఉండగా, దాస్ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు.

## ఏరోస్పేస్ హబ్‌గా

# తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

రాకెట్ విక్రమ్–1ను శనివారం ఆయన ప్రారంభించారు. హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఏరో స్పేస్ పార్క్‌లోని మ్యాక్స్–క్యూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు హాజరయ్యారు. ప్రీ ఫ్లైట్ పరీక్షలన్నింటినీ పూర్తి చేసుకుని తదుపరి ప్రయోగం కోసం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ఇది చేరుకోనుంది. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఏరోస్పేస్ రంగంలో అగ్రగామిగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని అన్నారు. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకు వెళ్లేందుకు భారతదేశపు మొట్టమొదటి ప్రయివేట్ ఆర్బిటల్ రాకెట్‌ను హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం ఏరోస్పేస్ రంగంలో రాష్ట్రాభివృద్ధికి ఇదొక మైలురాయని అభివర్ణించారు. స్కైరూట్ సంస్థ 2022లో తన తొలి రాకెట్‌ను ప్రయోగించిందనీ, అయితే ఇంత తక్కువ సమయంలోనే ఆర్బిటల్ ప్రయోగ దశకు చేరుకోవడం హర్షణీయమని అన్నారు. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బోయింగ్, ఎయిర్‌బస్, సాఫ్రాన్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజాలు రాష్ట్రంలో ఇప్పటికే ఉన్నాయని గుర్తు చేశారు. 2047 నాటికి ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ప్రపంచాన్ని శాసించే దశకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2023–24, 2024–25 మధ్యలో దేశంలోనే ఇంజినీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ 117.9 శాతం అత్యధిక వృద్ధిని నమోదు చేసిందన్నారు. ప్రపంచ విశ్వ విద్యాలయాలు, పారిశ్రామిక దిగ్గజాలతో భాగస్వామ్యాల ద్వారా ఏరోస్పేస్ రంగం అవసరాల కోసం యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలపై తమ ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. అందుకు అవసరమైన విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రతిభతో స్కైరూట్ వంటి కంపెనీలకు మద్దతు ఇవ్వడానికి తమ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకనుగుణంగా ప్రతిభావంతులకు నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) త్వరలో ఉన్నతీకరించబడనున్న పాలిటెక్నిక్ కళాశాలల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను ఆయన వివరించారు. స్కైరూట్ సంస్థ తమకు అవసరయ్యే నిపుణుల కోసం హైదరాబాద్‌లోని మల్లేపల్లిలో ఉన్న ఏటీసీని సందర్శించాల్సిందిగా సీఎం ఈ సందర్భంగా ఆహ్వానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ, ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదని అన్నారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి సమగ్ర ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్‌రెడ్డి, స్కైరూట్ సహ వ్యవస్థాపకుడు నాగ భరత్ డాకా తదితరులు పాల్గొన్నారు.

**స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేస్తాం : స్కైరూట్**

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని స్కైరూట్ ఏరోస్పేస్ సీఈఓ, కోఫౌండర్ పవన్ కుమార్ చందన తెలిపారు. స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా తమకు అవసరమైన ప్రతిభావంతులు దొరకడం సుగమం అవుతుందని అన్నారు. పరిశ్రమలుగా తాము ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నైపుణ్యత, శిక్షణే అని ఆయన చెప్పారు.

## ప్రజాస్వామ్య సూత్రాలకు

# బీజేపీ పాతర

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఎన్నికల్లో విజయం సాధించలేమని భావించిన చోట్ల బీజేపీ అన్ని ప్రజాస్వామ్య నిబంధనలను, ప్రమాణాలను గాలికి వదిలేసి, రెయిడ్– డిఫెక్ట్ -- రీసెట్ (కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు -- అటుపై పాలక పార్టీలోకి ఫిరాయింపులు -- చివరగా కేసుల మూసివేత, లేదా సంబంధిత పార్టీకి క్లీన్‌చిట్ ఇవ్వడంతో ముగియడం) సూత్రాన్ని పాటిస్తుందని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబీ విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీకి ప్రయాణమనేది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వల్లనే సాధ్యమైందని ఆయన వ్యాఖ్యానించారు. సైద్ధాంతిక నిబద్ధత లేకపోతే రాజకీయాలనేవి ఒక కట్టుబాటు లేకుండా చాలా పెళుసుగా తయారవుతాయని, అధికారాన్ని అమ్మకపు సరుకుగా మార్చివేస్తారని, ఇది గుర్తుంచుకోవాల్సిన అంశమని బేబీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## రీపోలింగ్‌కు

# ఆదేశించలేదు : ఈసీ

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదని తెలిపింది.ఈ మొత్తం ప్రక్రియను వీడియో తీశారని, ధ్రువీకరణ అనంతరం పత్రాలను తిరిగి సీల్ చేశారని పేర్కొంది. ఇవిఎం -- వివి ప్యాట్ యూనిట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పర్యవేక్షణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించింది.

# హైకోర్టుకు తొలి మహిళా సీజే

(మొదటి పేజీ తరువాయి)

చేయించారు. జస్టిస్ లీసా గిల్ నవంబరు 17, 1966న చండీగఢ్‌లో జన్మించారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ హర్పాల్ సింగ్ బ్రార్ కుమార్తె ఆమె. పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి బిఎ–ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. పంజాబ్–హర్యానా హైకోర్టులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. దాదాపు పాతికేళ్లపాటు ప్రాక్టీస్ చేశారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ కేసుల్లో మంచి పేరు సంపాధించారు. చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతానికి చాలాకాలం పాటు ప్రభుత్వ న్యాయవాదిగా, పలు సంస్థలు, కార్పొరేషన్లకు స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. 2014 మార్చి 31న పంజాబ్–హర్యానా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. తర్వాత శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం ముందుగానే ఆమెను రాష్ట్ర హైకోర్టుకు బదిలీ చేస్తూనే నూతన సిజె కానున్నారని ప్రకటించింది. అడ్వాన్స్ ట్రాన్స్‌ఫర్ పాలసీలో భాగంగా గత మార్చిలోనే రాష్ట్ర హైకోర్టుకు బదిలీపై వచ్చారు. 2028 నవంబరు 16 వరకూ ఆమె హైకోర్టు సిజెగా కొనసాగుతారు. ఆమె ఎన్నో సంచలన తీర్పులను వెలువరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. ప్రమాణ స్వీకారానికి ముందే ఆమెను సిఎం చంద్రబాబు మర్యాదపూర్వకంగా సమావేశమై పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

**సిజె జస్టిస్ ఠాకూర్‌కు వీడ్కోలు**

ఇప్పటి వరకు సిజెగా పనిచేసిన జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. నూతన సిజె జస్టిస్ లీసా గిల్ ప్రసంగిస్తూ, కోర్టుల్లో మౌలిక వసతుల కోసం జస్టిస్ ఠాకూర్ కృషి చేశారని కొనియాడారు. జడ్జిల నివాస సముదాయాలు, కోర్టు భవనాల నిర్మాణాలు కూడా ఆయన హయాంలో ప్రారంభమయ్యాయన్నారు. జ్యుడీషియల్ అకాడమీకి కూడా శంకుస్థాపన జరిగిందన్నారు. చీఫ్ జస్టిస్ ఠాకూర్ భావోద్వేగంతో ప్రసంగించారు. సత్వర న్యాయం అందించాల్సి వుందన్నారు. జస్టిస్ సిటీ ప్రతిపాదన కార్యరూపంలో పెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను సన్మానించారు.

# సింహాచలం చందనోత్సవంలో కనిపించని గంటా



**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:** సీనియర్ మోస్ట్ లీడర్. ప్రతీ ఎన్నికలప్పుడు నియోజకవర్గం మార్చి పోటీ చేసి గెలవడం ఆయన స్టైల్. అలాంటి లీడర్ కొన్నాళ్లుగా సైకిల్ పార్టీలో సైలెంట్‌గా ఉండిపోతున్నారట. టచ్ మీ నాట్ అన్నట్లుగా ఉంటున్నారట. లేటెస్ట్‌గా ఆయన నియోజకవర్గ పరిధిలో జరిగిన..చందనోత్సవంలో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే కనిపించకపోవడం చర్చకు దారితీసింది.

ఉత్తరాంధ్రలో మోస్ట్ పాపులర్ లీడర్ గంటా శ్రీనివాసరావు. 2014లో మంత్రిగా చక్రం తిప్పారు. ఆ తర్వాత 2019లో వైసీపీ వేవ్‌లోనూ గెలిచారు. 2024లో గెలిచాక అమాత్య యోగం దక్కక పోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు కొన్నాళ్లుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది చాలదన్నట్టు లేటెస్ట్‌గా సింహాచలంలోని శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామి ఆలయ చందనోత్సవంలో ఆయనెక్కడా కనిపించలేదు. గంటా నియోజకవర్గం అయిన భీమిలి పరిధిలోకే సింహాచలం వస్తోంది. ఏడాదికి ఒకసారి జరిగే అతిపెద్ద ఈ ఆధ్యాత్మిక వేడుకకు సీనియర్ టీడీపీ లీడర్, సిట్టింగ్ ఎమ్మెల్యే గంటా దూరంగా ఉండటం..తన నియోజకవర్గ పరిధిలోనే జరిగినా అటువైపు కన్నెత్తి చూడకపోవడం చర్చకు దారితీస్తోంది.సింహాచల ఆలయ ఉత్సవాల బాధ్యతలను హోంమంత్రి అనితకు ఇచ్చింది సర్కార్. ఆమె అంతా తానై రివ్యూలు చేసి.. ఎక్కడా భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే తన నియోజకవర్గంలో జరిగిన వేడుకకు సీనియర్ నేతనైన తనను కాదని..హోంమంత్రికి బాధ్యతలు అప్పగించడం గంటాకు నచ్చలేదనేది ఓ వర్గం వాదన. గతేడాది చందనోత్సవంలో గోడ కూలి అపశృతి జరగడం..ప్రభుత్వానికి కాస్త బ్యాడ్ నేమ్ రావడంతో ఈసారి జాగ్రత్తలు తీసుకుందట సర్కార్. అందుకే హోంమంత్రి అనితకు బాధ్యతలు అప్పగించారని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా సరే ఓటమి అంటే తెలియని నాయకుడు గంటా. అలాగే జిల్లాలో పోటీ చేసిన స్థానం నుంచి తిరిగి పోటీ చేయకుండా విజయ కేతాన్ని ఎగురవేయడం ఆయన స్టైల్. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ, టీడీపీ ప్రభుత్వంలోనూ మంత్రిగా పని చేశారు. అలా ఉత్తరాంధ్రలో సీనియర్ మోస్ట్ లీడర్‌గా.. ఓటమెరుగని నేతగా ఉన్న ఆయనకు 2024లో కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రి పదవి దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్నారన్న టాక్ నడిచింది. ప్రభుత్వంలో పదవి దక్కకపోయినా..పార్టీలో మంచి పొజిషన్ ఇస్తారని ఆశపడ్డ గంటాకు నిరాశే ఎదురైందట. అటు పొలిట్ బ్యూరో, ఇటు జాతీయ, రాష్ట్ర కమిటీల్లో ఆయనకు చోటు దక్కలేదు. పోనీ గంటాకు బదులుగా ఆయన కుమారుడు రవితేజకు అయినా సరే యూత్ కోటాలో ఛాన్స్ ఇచ్చారంటే అదీ లేదు. తండ్రీ కొడుకులిద్దరికీ టీడీపీ అధిష్టానం మొండి చేయి చూపింది. ఉత్తరాంధ్రలోని సీనియర్ లీడర్లకు లేదా, వారి వారసులకు పార్టీలోని ఏదో ఒక పొజిషన్ కట్టబెట్టారు. కానీ గంటాకు, ఆయన కుమారుడుకు పార్టీ పదవులు దక్కలేదు. తాను కోరుకున్న మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టడం, ఓ వైపు పార్టీ కమిటీల్లో స్థానం లేకుండా చేయడంతో గంటా డీప్‌గా హర్ట్ అయ్యారన్న గుసగుసలకు దారితీసింది. ఇక తన నియోజకవర్గంలో జరిగే చందనోత్సవ నిర్వహణ బాధ్యతలు పూర్తిగా హోంమంత్రికి అప్పగించడం కూడా తనను తగ్గించడమేనన్న ఫీలింగ్‌లో ఉన్నారట గంటా. అందుకే ఆయన చందనోత్సవం రోజు విశాఖలో లేకుండా..బిజీగా ఉండటం వల్లే రాలేదనే సంకేతాన్ని పంపే ప్రయత్నం చేశారట.మరోవైపు టీడీపీ అధిష్టానం పెద్దలు గంటాను పూర్తిస్థాయిలో తమవాడిగా నమ్మడం లేదన్నది తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్న మాట. చంద్రబాబు అరెస్ట్ అప్పుడు..ఆ తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం..హైకమాండ్ పెద్దలు ఫోన్ చేసినా లైట్ తీసుకోవడం వంటివి టీడీపీ అధిష్టానంతో గంటాకు గ్యాప్ ఏర్పడటానికి కారణమయ్యాయని అంటున్నారు. అందుకే ఇప్పుడు పవర్‌లోకి వచ్చినా ఆయనకు పెద్దపీట దక్కట్లేదని ఓపెన్ సీక్రెట్ అంటున్నారు విశాఖ టీడీపీ నేతలు.


# టికెట్ల తనిఖీతో 22 రోజుల్లో రూ.10 కోట్లు




**విజయవాడ-సూర్య వాస్తవం:** విజయవాడ రైల్వే డివిజన్ ప్రయాణికులకు విధించే జరిమానాల ద్వారా భారీగా ఆదాయాన్ని సాధించింది. కేవలం 22 రోజుల్లో ఏకంగా రూ.10 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో జోనల్ స్థాయిలో ఇంత భారీ ఆదాయం రావడం సరికొత్త రికార్డ్ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బందిని అధికారులు అభినందించారు.విజయవాడ రైల్వే డివిజన్ సరికొత్త రికార్డ్ సృష్టించింది. ప్రయాణికులకు విధించే జరిమానాల (టికెట్స్ తనిఖీ) ద్వారా ఏప్రిల్ నెలలో 22 రోజుల్లో భారీగా ఆదాయం లభించింది. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో టికెట్ల తనిఖీల ద్వారా 22 రోజుల వ్యవధిలో, రికార్డు స్థాయిలో రూ.10 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే జోనల్ స్థాయిలో ఇంత ఆదాయం రావడం ఒక రికార్డు అని అధికారులు చెబుతున్నారు. గతేడాది అక్టోబరులో నెలవారీ ఆదాయం రూ.8.59 కోట్ల ఆదాయం వచ్చింది.. ఇప్పుడు ఆ రికార్డును అధిగమించారు. ఇది రికార్డ్ మాత్రమే కాదు ఆల్ టైమ్ రికార్డ్ అని చెబుతున్నారు.విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో సీనియర్ డీసీఎం బి ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో రైల్వే తనిఖీ సిబ్బంది ప్రతి రోజూ రైళ్లు, స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎవరైనా ప్రయాణికులు టికెట్లు లేకుండా ప్రయాణిస్తుంటే వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. అయితే విజయవాడ డివిజన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.76.34 కోట్లు ఆదాయం లభించింది. తనిఖీల ద్వారా భారీగా ఆదాయం సాధించినందుకు సీనియర్ డీసీఎం ప్రశాంత్ కుమార్, తనిఖీ సిబ్బందిని డీఆర్ఎం మోహిత్, అధికారులు అభినందించారు.రైల్వేశాఖ దేశవ్యాప్తంగా టికెట్ల తనిఖీ చేపడుతుంది.. టికెట్లు లేకుండా ప్రయాణించేవారికి జరిమానాలు విధిస్తుంటారు. ప్రయాణికుల దగ్గర టికెట్లను తనిఖీలు చేసేందుకు టీటీలు విధుల్లో ఉంటారు.. వీరు రైల్వే స్టేషన్‌లతో పాటుగా రైళ్లలో కూడా తనిఖీలు చేస్తుంటారు. కొంతమంది ప్రయాణికులు టికెట్లు లేకుండా ప్రయాణిస్తూ వీరికి అడ్డంగా దొరికిపోతారు. టికెట్ లేనివారికి రైల్వే చట్టంలోని 137, 138 సెక్షన్ల ప్రకారం జరిమానా విధిస్తున్నారు. అలాగే జరిమానాతో పాటు ఆ ప్రయాణికుడు ఎక్కిన స్టేషన్ నుంచి టీటీకి దొరికిపోయిన స్టేషన్ వరకు అయ్యే టికెట్ డబ్బులు కూడా వసూలు చేస్తారు. ఒకవేళ ప్రయాణికుడు జరిమానా చెల్లించడానికి నిరాకరిస్తే.. రైలు నుంచి దింపేస్తారు. అంతేకాదు రైల్వే మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉంటుందని రైల్వే చట్టాలు చెబుతున్నాయి.

# హిట్ తక్కువ.. హిస్టరీ ఎక్కువ

## సంపాదకీయం




ప్రజల నమ్మకమే పార్టీకి ప్రాణం.. అది కోల్పోతే ఎంతటి వారైనా చరిత్ర పుటల్లో పేర్లుగా మిగలడం అనివార్యం. 'తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రం ఎప్పుడూ ఆసక్తికరమే. సిద్ధాంతాల కంటే సంచలనాలకే ఇక్కడ పెద్దపీట. పవర్‌కోసం పుట్టి.. విలీనాల్లో ముగిసిన పార్టీల కథలుమెజారిటీ పార్టీలు మనుగడ కోసం పెద్ద పార్టీల్లో కలిసిపోతున్నాయి. సిద్ధాంతం కంటే వ్యక్తుల చుట్టూ రాజకీయాలు తిరగడం వల్ల నేత వెనుకబడితే పార్టీ కనుమరుగవుతోంది. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ లేకపోవడం, కేవలం ఎన్నికల ముందే హడావుడి చేయడం కూడా పలు సందర్భాలలో కనిపించింది.తెలుగు రాజకీయ చరిత్రను గమనిస్తే.. 'ప్రజల నమ్మకమే పార్టీకి ప్రాణం.. అది కోల్పోతే ఎంతటి వారైనా చరిత్ర పుటల్లో పేర్లుగా మిగలడం అనివార్యం జాగృతి నేత, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీని ప్రకటించారు తెలుగు రాష్ట్రాల్లో మరోసారి 'ప్రాంతీయ పార్టీల' ప్రస్థానంపై చర్చ మొదలైంది. ఉమ్మడి ఎపినుంచి నేటి విభజిత రాష్ట్రాల వరకు తెలుగు రాజకీయ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టాయి, కొన్ని చరిత్ర సృష్టించాయి, మరికొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి గమనిస్తే ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ గురించి చెప్పాలి. తెలుగు రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీ అంటే గుర్తొచ్చే మొదటి పేరు తెలుగుదేశం.1982లో నందమూరి తారకరామారావు స్థాపించిన ఈ పార్టీ కేవలం 9 నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకుని రికార్డు సృష్టించింది. ఢిల్లీ పెత్తనానికి వ్యతిరేకంగా 'తెలుగువారి ఆత్మగౌరవం' నినాదంతో పుట్టిన ఈ పార్టీ, నాలుగు దశాబ్దాల తర్వాత కూడా నేడు ఆంధ్రప్రదేశ్‌లో అధికార పీఠంపై ఉండి తన ఉనికిని చాటుకుంటోంది. మరోవైపు, రైతు నాయకుడు ఆచార్య ఎన్.జి. రంగా స్థాపించిన కిషికార్ లోక్ పార్టీ, రాజగోపాలాచారి స్థాపించిన స్వతంత్ర పార్టీ ఒకప్పుడు ఉమ్మడి ఎపిలో బలమైన ముద్రవేసినప్పటికీ, కాలక్రమేణా పెద్ద పార్టీల్లో విలీనమై అంతర్ధానమయ్యాయి. 1969లో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా సమితి 1971 లోక్‌సభ ఎన్నికల్లో 14 స్థానాలకు గాను 10 గెలిచి ప్రభంజనం సృష్టించినా, చివరకు కాంగ్రెస్‌లో విలీనమై ఒక అధ్యాయాన్ని ముగించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 ఆగస్టు 26న తిరుపతిలో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం 18% ఓట్లు సాధించినా రెండేళ్లకే కాంగ్రెస్‌లో విలీనమైంది. మాజీ సిఎం కిరణ్ కుమార్‌రెడ్డి స్థాపించిన జై సమైక్యాంధ్ర, వి.వి. లక్ష్మీనారాయణ స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీ వంటివి ఓటర్లను ఆకట్టుకోవడంలో వెనుకబడ్డాయి. రాష్ట్రవిభజనను వ్యతిరేకిస్తూ అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి 2014లో జై సమైక్యాంధ్ర పార్టీ పార్టీని స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఈ పార్టీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. మెజారిటీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. ఎన్నికల తర్వాత కిరణ్ కుమార్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీ దెబ్బతిన్నది. తర్వాత ఆయన బిజెపిలో చేరిపోయారు. ఎన్‌టిఆర్ మరణానంతరం లక్ష్మీపార్వతి స్థాపించిన ఎన్‌టిఆర్ టిడిపి, నందమూరి హరికృష్ణ స్థాపించిన అన్నా టిడిపి కూడా వారసత్వ పోరులో నిలబడలేకపోయాయి. ఐఎఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ 2006లో రాజకీయ సంస్కరణల కోసం స్థాపించిన లోక్ సత్తా పార్టీ కూకట్‌పల్లి నుంచి ఒక సీటు గెలిచినప్పటికీ, కాలక్రమేణా ఎన్నికల రాజకీయాలకు దూరమైంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ వివిధ ప్రజాసంబంధ అంశాలపై ఆ పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పోరాటాలు సాగిస్తున్నారు. ఇక సంచలనాల కె.ఎ.పాల్ 2008లో రాజకీయాల్లోకి ప్రవేశిస్తూ ప్రజాశాంతి పేరిట ప్రాంతీయ పార్టీని స్థాపించారు. 2009లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని స్థానాల్లో పోటీ చేసినా చెప్పుకోదగ్గ ఓట్లు సాధించలేకపోయింది. తర్వాత 2019 లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీ అభ్యర్థులను నిలబెట్టింది. పాల్ స్వయంగా నరసాపురం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసి కేవలం 3,046 ఓట్లు (0.3%) మాత్రమే సాధించారు. 2024లో విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసినప్పటికీ, కేవలం 7,529 ఓట్లు మాత్రమే పొంది ఓటమి పాలయ్యారు. ఈ పార్టీకి ఎన్నికల సంఘం గుర్తింపు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రాజకీయ ప్రభావం చాలా తక్కువనే చెప్పాలి. తెలంగాణ సాధన సమితి పేరిట ఆలే నరేంద్ర స్థాపిం చిన ఈ పార్టీ తర్వాత టిఆర్ఎస్ (ప్రస్తుతం బిఆర్ఎస్)లో విలీనమైంది. అలాగే తల్లి తెలంగాణ పార్టీ పేరిట ప్రస్తుత కాంగ్రెస్ ఎంఎల్‌సి, నటి విజయశాంతి స్థాపించిన ఈ పార్టీ కూడా తర్వాత టిఆర్ఎస్‌లో విలీనమైపోయింది. అయితే ఈ రెండు పార్టీలను తమ పార్టీలో చేర్చుకునేంతవరకు ఆదరించిన కెసిఆర్ తర్వాత నరేంద్ర, విజయశాంతికి మొండిచేయి చూపడమేగాక వారు పార్టీ నుంచి వెళ్లిపోయేలా వ్యవహరించారన్న విషయం ప్రచారంలో ఉంది. అటువంటి కెసిఆర్ పార్టీని వ్యతిరేకిస్తూ ఇప్పుడు స్వయంగా ఆయన కూతురు కవిత వేరుకుంపటి పెట్టడం చర్చనీయమైంది. గతంలో జై తెలంగాణ పార్టీ పేరిట పి. ఇంద్రారెడ్డి స్థాపించిన పార్టీ ఆయన మరణం తర్వాత ఉనికిని కోల్పోయింది. ఆయన సతీమణి కాంగ్రెస్ టిక్కెట్‌పై గెలిచి తర్వాత కాలంలో కెసిఆర్ పంచన చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ పరిరక్షణ సమితి పేరిట బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి స్థాపించిన పార్టీ కూడా ఎన్నికల్లో ప్రభావం చూపలేక పోయింది. విభజిత ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వారసత్వ యుద్ధం, సినీ గ్లామర్ రెండు ప్రధాన పార్టీలకు జన్మనిచ్చాయి. కాంగ్రెస్ అధిష్టానంపై తిరుగుబాటు చేసి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ఒక ప్రాంతీయ పార్టీగా అత్యంత వేగంగా అధికారంలోకి వచ్చింది.. రాజశేఖర్‌రెడ్డి వారసత్వాన్ని అందిపుచ్చుకుని 2019లో భారీ విజయాన్ని అందుకుంది. అయితే శివ కుమార్ అనే వ్యక్తి 2010 -11 ప్రాంతంలోనే 'వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ' పేరును కేంద్ర ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ చేయించారు. జగన్ మోహన్‌రెడ్డి తన పార్టీకి ఇదే పేరును వాడుతుండటంతో, శివకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తనదేనని, జగన్ తన పేరును అక్రమంగా వాడుకుంటున్నారని ఆయన కోర్టును ఆశ్రయించారు. జగన్ పార్టీని తన పార్టీలో విలీనం చేయాలని లేదా జగన్ కొత్త పేరు పెట్టుకోవాలని ఆయన వాదించారు. ఈ వివాదం నడుస్తున్న సమయంలోనే, జగన్ మోహన్‌రెడ్డి వర్గం శివకుమార్‌తో చర్చలు జరిపింది.

చివరకు శివకుమార్ తన పార్టీని జగన్ నాయకత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడానికి అంగీకరించారు. దీనితో సాంకేతికంగా శివ కుమార్ స్థాపించిన పార్టీయే ప్రస్తుత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీగా కొనసాగింది. ఈ విలీనం తర్వాత, కేంద్ర ఎన్నికల సంఘం జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడిగా గుర్తిస్తూ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 'ఫ్యాన్' గుర్తును కేటాయించింది. మరోవైపు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో 'వైఎస్ఆర్' అంటే 'యువజన శ్రామిక రైతు' కాంగ్రెస్ పార్టీ అని అర్థం. అయితే, దివంగత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఫోటో, పేరును వాడుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేసింది. కానీ జగన్ తన పార్టీ పేరులో వైఎస్ఆర్ అంటే 'యువజన శ్రామిక రైతు' అని స్పష్టం చేయడంతో ఆ వివాదం సద్దుమణిగింది. ఇక ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ సుదీర్ఘ పోరాటం తర్వాత 2024లో ఎపి ప్రభుత్వంలో భాగస్వామిగా మారి కీలక శక్తిగా ఎదిగింది. 2014, మార్చి 14న హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ఈ పార్టీని ప్రకటించారు. పార్టీ స్థాపించిన వెంటనే వచ్చిన 2014 ఎన్నికల్లో జనసేన నేరుగా పోటీ చేయలేదు. 'రాష్ట్ర విభజన' నేపథ్యంలో అనుభవం ఉన్న నాయకత్వం కావాలని భావించి టిడిపి -బిజెపి కూటమికి మద్దతు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో కూటమి విజయంలో జనసేన కీలక పాత్ర పోషించింది. 2019లో జనసేన తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగింది. వామపక్షాలు, బిఎస్‌పితో కలిసి కూటమిగా పోటీ చేసింది. మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను జనసేన 137 స్థానాల్లో పోటీ చేసింది. కేవలం 1 స్థానంలో (రాజోలు -రాపాక వరప్రసాద్- తర్వాత ఆయన వైసిపి తీర్థం పుచ్చుకున్నారు) మాత్రమే విజయం సాధించింది.18 లోక్‌సభ స్థానాల్లో పోటీచేసి, ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. పవన్ కల్యాణ్ గాజువాక, భీమవరం సీట్లనుంచి పోటీ చేసి, స్వల్ప తేడాతో రెండు చోట్లా ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో జనసేన పార్టీ టిడిపి, బిజెపిలతో కలిసి 'మహాకూటమి'గా పోటీ చేసింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతో పవన్ కల్యాణ్ ఈ పొత్తుకు చొరవ తీసుకున్నారు. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన 21 స్థానాల్లో పోటీ చేసింది. పోటీ చేసిన 21కి 21 స్థానాల్లోనూ ఘన విజయం సాధించి, 100% నమోదు చేసింది. పవన్ కల్యాణ్ పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుండి 70,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో భారీ విజయం సాధించి, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాకినాడ, మచిలీపట్నం ఎంపి సీట్లలో పోటీ చేసి, రెండు చోట్లా విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్రం విషయానికొస్తే.. ఉద్యమ గడ్డపై 'గులాబీ' ప్రస్థానం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ప్రత్యేక తెలంగాణే లక్ష్యంగా 2001లో కెసిఆర్ ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బిఆర్ఎస్) రాష్ట్రాన్ని సాధించి, పదేళ్లపాటు తిరుగులేని పాలన సాగించింది. జాతీయ ఆకాంక్షతో 2022లో బిఆర్ఎస్‌గా రూపాంతరం చెందినా, 2023 ఎన్నికల తర్వాత ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తన ఉనికిని కాపాడుకునే పోరాటంలో ఉంది. జాతీయ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనే లక్ష్యంతో, పార్టీ అధినేత కె. చంద్రశేఖర్‌రావు తన ప్రాంతీయ పార్టీ పేరును 2022, అక్టోబరు 5 దసరా పండుగ రోజున మార్చారు. కేంద్ర ఎన్నికల సంఘం 2022, డిసెంబరు 8న ఈ పేరు మార్పును అధికారికంగా ఆమోదించింది. ఈ పార్టీ జాతీయ స్థాయిలో ఎదగడానికి ఇతర రాష్ట్రాల్లో కూడా తన శాఖలను ప్రారంభించింది. 2023 జనవరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనిట్‌ను ప్రారంభించారు. దీనికి అధ్యక్షుడిగా మాజీ ఐఎఎస్ అధికారి తోట చంద్రశేఖర్ నియ మితులయ్యారు. అదే విధంగా అత్యధికంగా మహారాష్ట్రపై దృష్టి సారించి అక్కడ అనేక బహిరంగ సభలు నిర్వహించి, స్థానిక నేతలను పార్టీలో చేర్చుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగ్ వంటి కీలక నేతలు చేరారు. జాతీయ కార్యకలాపాల కోసం ఢిల్లీలోని సర్దార్ పటేల్ మార్గ్‌లో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. అనూహ్యంగా 2023 అసెంబ్లీ తర్వాత పార్లమెంటు, ఆపై అసెంబ్లీ ఉప ఎన్నికలు, పంచాయితీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, కేంద్రంలోని అధికార బిజెపి నుంచి గట్టి దెబ్బలు తగిలిన తర్వాత పార్టీ తన జాతీయ విస్తరణ వేగాన్ని తగ్గించి, ప్రస్తుతం రాష్ట్రస్థాయి రాజకీయాలపై ఎక్కువ దష్టి సారిస్తోంది. తెలంగాణలో వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల తన అన్న జగన్‌తో విభేదించాక వైఎస్ఆర్ టిపి పేరిట పార్టీని స్థాపించి పాదయాత్రలు చేసినా, చివరకు 2024లో కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఇక హైదరాబాద్ పాతబస్తీ కేంద్రంగా ఎఐఎంఐఎం తన బలాన్ని నిలబెట్టుకుంటూనే ఉంది కమ్యూనిస్టుల ప్రస్థానం.. మతపరమైన సమీకరణలు: 1946 నాటి సాయుధ పోరాటం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టుల ప్రభావం ఉన్నప్పటికీ, 1964లో సిపిఐ, సిపిఐగా చీలిపోవడం వారిని బలహీనపరిచింది. ప్రస్తుతం ఈ పార్టీలు ఉనికి కోసం పోరాడుతున్నాయి. మరోవైపు, హిందూత్వ సిద్ధాంతంతో బిజెపి రెండు రాష్ట్రాల్లోనూ బలపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమిలో భాగస్వామిగా ఉంది. తెలంగాణలో అద్వితీయ శక్తిగా ఎదుగుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 8 స్థానాలు గెలవడం దీనికి నిదర్శనం. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 200లకు పైగా చిన్న పార్టీలు రిజిస్టర్ అయి ఉన్నా, నిలబడలేకపోవడానికి పలు ప్రధాన కారణాలున్నాయి.



## డాక్టర్ వరప్రసాద్ కి అభినందనల వెల్లువ



**పులివెందుల - సూర్య వాస్తవం:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన పులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ క అభినందనల వెల్లువ కొనసాగాయి. వివరాల్లోకి వెళ్తే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ వరప్రసాద్ నియమించడం పట్ల స్థానిక వైకాపా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ పట్ల నిబద్ధతతో వివిధ విభాగాలలో తన పాత్రను నిర్వహణను పార్టీ గుర్తించిందని పలువురు పేర్కొంటూ వరప్రసాద్ ని దుశ్యాలువాతో సత్కరించి రానున్న కాలంలో మరిన్ని పదవులు వరించాలని అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ , వైకాపా నేతలు పద్మనాభ రెడ్డి, కొంగనపల్లి రవి, కోటం శెట్టి హరి, దాసరి చంద్రమౌళి మరియు ఇతర వైకాపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే

## కఠిన చర్యలు తప్పవు

### ఎస్సై తాహిర్ హుస్సేన్



**వేంపల్లె సూర్య వాస్తవం:** వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు ఎస్.ఐ. తాహిర్ హుస్సేన్ హెచ్చరించారు. శనివారం స్థానిక పట్టణంలోనీ నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు, అవగాహన కల్పించారు. అనంతరం ఎస్.ఐ. తాహిర్ హుస్సేన్ మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం నేరం అందుకుగాను వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి లేదంటే వాహనాదారులకు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి. లైసెన్స్ లేనిచో వాహనము సీజ్ చేస్తామని అలాగే నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. తాహిర్ హుస్సేన్ హెచ్చరించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తులకు తీవ్ర గాయాలు

## అధిక వేగా నిర్లక్ష్యం ప్రమాదానికి కారణం




**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాద సంఘటన చోటు చేసుకోవడం జరిగింది.. వివరాలకు వెళితే మైనర్ బాలులు ఆకతాయితనంతో అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపు కుంటూ రావడంతో హెచ్డిఎఫ్సి బ్యాంకు సమీపంలో అటువైపుగా వస్తున్న వాటర్ క్యాన్ల ఆటోను ఢీ కొనడంతో ప్రమాద వశతు ఈ సంఘటన చోటుచేసు కుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్థానికుల పోలీస్ సమాచారం ఇవ్వగా వెంటనే సంఘటన స్థలానికి వచ్చి వివరాలు అడగగా ద్విచక్ర వాహనదారులు పులివెందుల పట్టణంలోని భాకరాపురం వీధి వాసులగా గుర్తించారు. వెంటనే స్థానికులు స్పందించి పోలీసులు వారిని వైద్య చికిత్సల నిమిత్తం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విచారణకు హాజరైన సజ్జల భార్గవ్ రెడ్డి



**పులివెందుల సూర్య వాస్తవం:** వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా విభాగం రాష్ట్ర కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డి నేడు కడప జిల్లా పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. గతంలో సోషల్ మీడియా వేదికగా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మరియు వారి కుటుంబ సభ్యులపై అభ్యంతరకరమైన, అసభ్యకరమైన పోస్టులు పెట్టారనే ఆరోపణలపై భార్గవ్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి.ప్రధానంగా రెండు సోషల్ మీడియా కేసులకు సంబంధించి డీఎస్పీ మురళీ నాయక్ ఆధ్వర్యంలోని బృందం భార్గవ్ రెడ్డిని విచారిస్తోంది.ఈ విచారణలో సైబర్ క్రైమ్ నిపుణులు కూడా పాల్గొని, సాంకేతిక ఆధారాల గురించి ప్రశ్నిస్తున్నారు. కనవంబర్ 8, 2024న రవీందర్ రెడ్డి,సజ్జల భార్గవ్ రెడ్డి,అర్జున్ రెడ్డిలపై ఈ కేసులు నమోదైనట్లు సమాచారం. తాడేపల్లిలోని ఐకాన్ బిల్డింగ్ కేంద్రంగా సుమారు 130 మంది కన్వీనర్లతో సోషల్ మీడియాలో ప్రత్యర్థి నాయకులను లక్ష్యంగా చేసుకుని పోస్టులు పెట్టించారని భార్గవ్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి.దీనిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ మహిళా పక్షపాతి



ముఖ్యమంత్రి గారూ !
చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ల కోసం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయండి

**డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**

**వేంపల్లె సూర్య వాస్తవం:** టిడిపి, బిజెపి, జనసేన పార్టీలకు మహిళా రిజర్వేషన్ల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే మహిళ రిజర్వేషన్ల బిల్లు కోసం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి సవాల్ చేశారు. శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లపై చర్చించడానికి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. మహిళా బిల్లుకు ఆమోదం లభించాల్సింది పార్లమెంటులో. అసెంబ్లీలో కాదు. చిత్తశుద్ధి ఉంటే ప్రధానితో మాట్లాడి డి లిమిటేషన్ బిల్లుతో లింకు పెట్టకుండా ఒక్క మహిళా రిజర్వేషన్ బిల్లు కోసమే వెంటనే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలని,కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తులసి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మహిళా పక్షపాతి. అని బీసెంట్, సరోజినీ నాయుడు, ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఏఐసిసి అధ్యక్షులుగా సేవ చేశారు. శ్రీమతి ప్రతిభాపాటిల్ రాష్ట్రపతిగా, ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా,మీరా కుమార్ లోక్సభ స్పీకర్గా సేవ చేసేటందుకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. కాంగ్రెస్ పార్టీ తరపున ఎంతో మంది మహిళలు గవర్నర్లు, కేంద్ర మంత్రులు,రాష్ట్ర మంత్రులు అయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరపున సుచేత కృపాలాని, నందినీ సత్పతి శశికలాకకోత్కర్, అన్వరా తైమూర్,రాజేందర్ కౌర్,షీలా దీక్షిత్ లాంటి మహిళలు ముఖ్యమంత్రులు అయ్యారు. 33 సంవత్సరాల కిందటే 1993 వ సంవత్సరంలోనే స్థానిక ప్రభుత్వాలైన గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ 33 శాతం రిజర్వేషన్లు కల్పించింది అన్నారు. దీనివలన లక్షలాది మంది మహిళ లు గ్రామపంచాయతీ వార్డు మెంబర్లుగా, సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, మండల పరిషత్ అధ్యక్షులుగా, జెడ్పిటిసిలుగా, జిల్లా పరిషత్ చైర్మన్లుగా, మున్సిపల్ కౌన్సిలర్లుగా, మున్సిపల్ చైర్మన్లుగా, కార్పొరేటర్లుగా, మేయర్లుగా పదవులు అలంకరించారు అన్నారు. మహిళల ఆర్థిక సామాజిక, సాధికారిత కోసం 1982 – 83 లోనే కాంగ్రెస్ పార్టీ డ్వాక్రా పథకాన్ని ప్రారంభించింది.డాక్రా మహిళల కోసం పావలావడ్డీ, సున్నా వడ్డీ పథకాలను ప్రారంభించింది. అమ్మల కోసం అమ్మ ఒడి పథకాన్ని,బాలికల బంగారు భవిష్యత్తు కోసం బంగారు తల్లి పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టింది. 2023లోనే పార్లమెంట్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇచ్చిన విషయాన్ని తులసి రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్, మహిళలు పర్యాయపదాలు.కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి అంటూ అవాకులు చెవాకులు మాట్లాడడం ముఖ్యమంత్రి మానుకోవాలని తులసి రెడ్డి సూచించారు.చిత్తశుద్ధి ఉంటే ప్రధానితో మాట్లాడి వెంటనే పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని తులసి రెడ్డి సవాల్ చేశారు.

# టొమోట ప్రాసెసింగ్, పరిశ్రమ సందర్శన



**పులివెందుల సూర్య వాస్తవం:** పులివెందుల ఆహార సాంకేతిక కళాశాల వారి ఆధ్వర్యంలో "టొమోట ప్రాసెసింగ్, విలువ జోడింపుపై నైపుణ్య అభివృద్ధి" అనే ఐ.సి.ఏఆర్ షెడ్యూల్డ్ ఉప ప్రణాళిక ప్రాజెక్ట్ లో భాగంగా నాల్గవ గ్రూపుతో పరిశ్రమ సందర్శన కార్యక్రమం శనివారం ఏప్రిల్ 25న జరిగింది. ఈ నాల్గవ గ్రూపుతో పరిశ్రమ సందర్శన కార్యక్రమంలో భాగంగా పులివెందుల మరియు లింగాల మండల పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల మహిళలు, యువత, రైతులుని ప్రొద్దుటూరు లో ఉన్న రమాదేవి ఫుడ్స్ పరిశ్రమకు తీసుకొని వెళ్ళి టమోటా ప్రాసెసింగ్ చేసి టమోటా ఊరగాయ తయారు విధానాన్ని కంపెనీ సీ.ఈవో శిరీష స్వయంగా నేర్పించారు. ఈ టమాటో ఊరగాయ తయారు చేయు పద్ధతిలో వివిధ దశలు అయినటువంటి టమాటోలను ముక్కలుగా కోయడం, సోలార్ టన్నెల్ డ్రయర్ లో టమాటో ముక్కలును ఎండ బెట్టె విధానం, ఊరగాయకు కావలసిన వివిధ పదార్థాలు కలపడం, టమాటో క్యూరింగ్, నిల్వ చేసే పద్ధతులు గురించి అవగాహన కల్పించారు. అలాగే మరికొన్ని ఇతర ఆహార పదార్థాలు తయారు చేయు విధానము, ప్యాకేజింగ్ మరియు ఆన్లైన్ మార్కెటింగ్ గురించి అవగాహన కల్పించటం జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇంచార్జ్ ఇంజినీర్ నజ్మా మాట్లాడుతూ టమాటో, మామిడి, నిమ్మకాయ వంటి పండ్లతో పచ్చళ్ళు తయారుచేసి ముఖ్యంగా మహిళలు ఉపాధి పొందవచ్చని తెలిపారు, ఇటువంటి పచ్చళ్ళు తయారు చేయటం, ఆహార పదార్థాలు ప్రాసెస్ చేసి అమ్మడం తద్వారా నిరుద్యోగులకు, యువతకు పని దొరుకుతుందని, మంచి ప్యాకేజింగ్ మరియు మార్కెటింగ్ ద్వారా లాభాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పరిశ్రమ సందర్శన కార్యక్రమం ద్వారా టమోటా ఊరగాయ తయారు చేయు విధానం మరియు ఇతర ఆహార పదార్థాల ప్రాసెసింగ్ గురించి తెలిసిందని విచ్చేసిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు పేర్కొన్నారు. ఈ నాల్గవ గ్రూపుతో పరిశ్రమ సందర్శన కార్యక్రమానికి కళాశాల ప్రాజెక్ట్ ఇన్చార్జ్ ఇంజినీర్ నజ్మా, అధ్యాపకుడు డాక్టర్ సాయి శ్రీనివాస్, పులివెందుల మరియు లింగాల మండల పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక ఎస్సీ కులాల వారు, కళాశాల విద్యార్థులు గిరీష్, సిసింద్ర, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

---

## బసినేపల్లి గ్రామానికి నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుత్తి సూర్య వాస్తవం:** గుత్తి మండలం బసినేపల్లి గ్రామం నందు నీటి సమస్య ఎక్కువా ఉన్నం దున ఈ సమస్య గుంతకల్ ఎమ్మె ల్యే గుమ్మ నూరు జయరాం దృష్టికి అలాగే గుత్తి పామిడి ఇన్చార్జ్ అయి న టువంటి గుమ్మనూరు ఈశ్వర్ దృ ష్టికి తెలుగుదేశం పార్టీ నాయకులు అయినటు వంటి వై రామాంజినే యులు తలారి నాగరాజు స్టోర్ డీల ర్ సుంకన్న తీసుకు వెళ్లడం జరిగిం ది అదేవిధంగా గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సానుకూలం గా స్పందించి ఆ యొక్క సమస్యను వెంటనే తీరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ రోజు బసినేపల్లి గ్రామం నందు బోరు వేపించడం జరిగింది. అదేవిధంగా నాలుగు ఇంచూలు నీ ళ్లు కూడా సంపూర్ణంగా పడటం జరి గింది.ఈ సమస్య తీర్చినందుకు బసి నేపల్లి గ్రామ ప్రజలు ఎన్ డి ఎ కూట మి నాయకులు గుమ్మనూరు జయ రాంకు కృతజ్ఞతలు తెలపడం జరి గింది.ఈ కార్యక్రమంలో ఎన్డిఎ నా యకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# మలేరియా రహిత సమాజమే మన లక్ష్యం

### సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య




**వేంపల్లె సూర్య వాస్తవం:** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని, తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేంపల్లి పట్టణంలో భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. శనివారం సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, నినాదాలతో ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చిన "ఇప్పుడు మనం సాధించగలం – ఇప్పుడు మనం తప్పక సాధించాలి" అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేయడమే తమ లక్ష్యమని తెలిపారు. మలేరియా అనేది కేవలం అనారోగ్యం మాత్రమే కాదని, సామాజిక బాధ్యతతో, అప్రమత్తతతో పూర్తిగా నిర్మూలించగలిగే వ్యాధి అని ఆయన పేర్కొన్నారు. ?ఇంటి పరిసరాల్లో, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు మరియు కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ ఉన్న నీరు దోమల పెరుగుదలకు కేంద్రంగా మారుతుంది.దోమల నియంత్రణకు నీటి ట్యాంకులు, డబ్బాలపై గట్టి మూతలు ఉంచాలి. డ్రైనేజీ కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రవహించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట తప్పనిసరిగా దోమతెరలు వాడటం మంచిదని అన్నారు. మలేరియా నిర్ధారణ రక్త పరీక్షలు మరియు చికిత్స అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిగా ఉచితంగా లభించును అని సిద్దయ్య అన్నారు ఈ కార్య క్రమములో సామజిక ఆరోగ్య అధికారి వెంకట రత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ రెడ్డి కుమారి, సి.హెచ్.ఓ.లు బసవయ్య, ప్రియదర్శిని, శంకరమ్మ, ఫియాజ్, షకీర్ ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోమలు నివారించుదాం
# వ్యాధులను తరిమికొడదాం
### మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్



**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం:** దోమలను నివారించి వ్యాధులను తరిమికొట్టాలని లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య లు పేర్కొన్నారు. మలేరియా దినోత్సవంను పురస్కరించుకొని శనివారం స్థానిక మూడు రోడ్ల కూడలిలో వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల వలన డెంగు మలేరియా చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చు అన్నారు.అంతే కాకుండా ప్రతి ఫ్రైడే డ్రైడేగ పాటించి మరుగుదొడ్లలోని తొట్లలో నీరును తీసివేసి తొట్లు ఆరబెట్టాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త నమూనాలు సేకరించాలన్నారు. ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులు అన్నారు. రాత్రి వేళల్లో ఇండ్లలో వేపాకు పొగ వేసుకోవాలన్నారు. మరుగుదొడ్లలోని తొట్లపై మూతలు పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్ ఎంపీహెచ్ఈఓ దానం హెల్త్ సూపర్వైజర్లు రాజేంద్రప్రసాద్ టిబి సూపర్వైజర్ హరి పంచాయతీ సెక్రెటరీ సుబ్బారెడ్డి సాదుల్ల వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజా దర్బార్ నిర్వహించి
## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే
### ప్రజా పరిపాలన ప్రభుత్వంలో ప్రజలు క్షేమం..
### ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాం
## ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు.









**రాయదుర్గం సూర్య వాస్తవం :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన 'ప్రజా దర్బార్' నిర్వహించి, ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, పారదర్శకతతో కూడిన సత్వర పరిష్కారాలను అందిస్తున్నామన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా అధికారుల్లో బాధ్యతను పెంచామన్నారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామన్నారు. పెన్షన్ల గురించి విన్నవించిన వారిని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం త్వరలోనే కొత్త పెన్షన్లను మంజూరు చేయనుందని వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, కొండాపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి షాపు ఓనరు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేసుకోవాలి
## నిషేహిత ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలపై ఉక్కుపాదం
### పులివెందుల పురపాలని కమీషనర్



**పులివెందుల సూర్య వాస్తవం:** ప్రతి షాపు ఓనరు డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని, అలాగే నిషేదిత ప్లాస్టిక్ కవర్లను అమ్మకూడదు అనే అంశంపై స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా శనివారం బోలెవార్డులో జరుగుతున్న షాపు ఓనర్లకు నోటీసులను జారీ చేసే కార్యక్రమాన్ని స్వయంగా కమిషనర్ మునికుమార్ పర్యవేక్షించారు. ఇప్పటికే పలుమార్లు నిషేధిత ప్లాస్టిక్ కవర్లను అమ్మవద్దని చెప్పినా అక్కడక్కడ కొన్ని షాపులు విక్రస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని వ్యాపారస్తులు ఇప్పటికైనా మారాలని లేకపోతే చట్టపరంగా ఫైన్లు విధిస్తామని అవసరమైతే లైసెన్సును రద్దు చేయడానికి కూడా ఏమాత్రం వెనకాడమని ఆయన షాపు ఓనర్లకు హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ దుకాణ యజమాలతో మాట్లాడుతూ షాపు ఆవరణలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను చెత్త బండికి మాత్రమే అందజేయాలని ఆయన సూచించారు. రాత్రిపూట ఎవరు లేని సమయంలో కొందరు అక్కడక్కడ చెత్తను రోడ్డుమీద పడవేస్తున్నారని అలా జరగకుండా చూసుకోవాలని 8 అంశాలతో కూడిన నోటీసును స్వయంగా ఆయనే షాప్ ఓనర్స్ కీ అందజేశారు. అనంతరం పులివెందులను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంలో తమ సహాయ సహాకారములు అందించాలని షాపు ఓనర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మా రెడ్డి కుటుంబం పై
# మాట్లాడే అర్హత ఎవరికీ లేదు



**మారెడ్డి కుటుంబంలో బీటెక్ రవి, శ్రీరామచంద్రుడు**
**సొంత చెల్లి పై విమర్శలు చేస్తే పట్టించుకున్న వారు లేరు**
**ఆ రామునికి ఒక్కడే లక్ష్మణుడు ఈ రాముడికి మాట జవదాటని ఇద్దరు లక్ష్మణులు**
**వైసీపీ నేతల తీరుపై అక్కులు గారి విజయ్ కుమార్ రెడ్డి మరియు అమర్నాథ్ కౌంటర్**

**పులివెందుల సూర్య వాస్తవం:** మా రెడ్డి కుటుంబంపై విమర్శలు చేసే అర్హత ఎవరికీ లేదని మా రెడ్డి కుటుంబంలో బీటెక్ రవి శ్రీరామచంద్రుడని, సొంత చెల్లిపై విమర్శలు చేస్తుంటే పట్టించుకున్న పాపాన పోలేదని, ఆనాటి శ్రీరామచంద్రునికి లక్ష్మణుడు ఒకరే కాగా నేడు ఇద్దరు లక్ష్మణులతో ప్రజా సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత బీటెక్ రవికే దక్కుతుందని తెదేపా నేతలు కడప జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్, శ్రీనాథ్ రెడ్డి మరియు శ్రీనివాస్ రెడ్డి తదితరులు వైకాపా నేతల వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇటీవల కాలంలో బీటెక్ రవి లక్ష్యంగా లింగాల మండల నాయకులు చేసినటువంటి వ్యాఖ్యలపై వారు మండిపడుతూ లింగాల మండల నాయకులు మిడిమిడి జ్ఞానంతో రాజకీయం మీద పూర్తి అవగాహన లేక మాట్లాడుతున్నారని బీటెక్ రవి గూడూరు దగ్గర 15 లక్షల రూపాయలు సొంత నిధులు ఇవ్వటానికి కూడా తల ప్రాణం తోకకు వచ్చిందన్న వ్యాఖ్యలపై వైకాపా నేతల మాదిరి దౌర్జన్యాలు, అక్రమ సంపాదన మా దగ్గర లేదని, అన్నదమ్ముల మధ్య రావాల్సిన వాటాలు ఇవ్వకుండా కాజేసినట్టుగా వ్యాఖ్యలు చేస్తున్నారని బీటెక్ రవి, మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబంలో శ్రీరామచంద్రుడని, ఆనాడు రామునికి లక్ష్మణుడు ఒక్కడే కాగా ఇక్కడ ఇద్దరు ఉన్నారని, మారెడ్డి కుటుంబ వృక్షాన్నంతా ఒక వేదికపై తీసుకుని రాగలమని, వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతులకు, జయంతులకు, రాజారెడ్డి వర్ధంతులకు మీ కుటుంబం సంబంధించిన వాళ్ళంతా ఒకే చోట ఏ రోజు కనపడలేదని, వైఎస్ షర్మిలకి మీకు కుటుంబ వ్యవహారాలు కావచ్చు, ఆస్తి తగాదాలు కావచ్చు, చిన్న కమ్యూనికేషన్ గ్యాప్ ఉండొచ్చు. దానికి మీరు కూర్చోపెట్టుకొని మాట్లాడి సర్ది చెప్పుకొని కుటుంబాన్ని వీధికి పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెద్దరికం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఉన్నదని అలా కాకుండా సొంత వారితో విమర్శలు చేయడం పద్ధతి కాదని, మీ కుటుంబంలో వ్యవహారాలు చక్కదిద్దుకోవాలి తప్ప మీ చిల్లర రాజకీయాల కోసం సొంత చెల్లెల్ని ఇలా అవమానించడం దేనికి నిదర్శనం తెలియజేయాలి అన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ మాట్లాడుతూ లింగాల మండలానికి కృష్ణా జలాలను అందించిన ఘనత ముమ్మాటికి టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందని వాటికి కృషి చేసింది కూడా సతీష్ రెడ్డి అని వాటన్నిటినీ మరిచిపోయి నేడు అసందర్భ వ్యాఖ్యలు మాట్లాడుతున్న సతీష్ రెడ్డి గతం గుర్తించుకోవాలని అదేవిధంగా అంబకపల్లి బాబు రెడ్డి అయితే నేమి అనేక అసాంఘిక కార్యక్రమాలు మరియు అక్రమ మార్గాలలో ఆదాయాన్ని ఆర్జించి ఇతరులకు నీతులు చెబుతున్నారని ఇలాంటి పద్ధతులు మానుకోవాలని లేనిపక్షంలో తెదేపాశ్రేణుల ఎదురుదాడిని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో
# అవకతవకలు
### అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువు: పత్తికొండ బిజెపి

**పత్తికొండ టౌన్ - సూర్య వస్తావశీ:** పత్తికొండలోని అంగన్వాడి కేంద్రాలలో తీవ్రమైన అవకతవకలు జరుగుతున్నాయని, వాటిపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకపోవడం ఆందోళనకరమని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు కరణం నరేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో బిజెపి అధికార ప్రతినిధి బ్రహ్మయ్య అధ్యక్షతన ముఖ్య నాయకులు సమావేశంలో పాత్రికేయులకు విడుదల చేసిన ప్రకటనలో కరణం నరేష్ మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న పత్తికొండ పట్టణంలోనే అంగన్వాడి కేంద్రాలు సమయానికి తెరుచుకోవడం లేదని, చాలాసార్లు సెంటర్లు మూసివేసి ఉండటం, ఒకవేళ తెరిచినా టీచర్లు లేకపోవడం, కేవలం ఆయాలు మాత్రమే ఉండి సెంటర్లను నడపడం జరుగుతుందని వాపోయారు.కేంద్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి కోసం, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కోట్ల రూపాయల నిధులు వెచ్చిస్తున్నప్పటికీ, స్థానిక స్థాయిలో అవి దుర్వినియోగం అవుతున్నాయని ఆయన ఆరోపించారు.అంగన్వాడి కేంద్రాలు నిర్దిష్ట సమయపాలన పాటించడం లేదు,టీచర్లు హాజరు కాకపోవడం, బాధ్యతలను ఆయాలకు అప్పగించడం, గర్భిణీలు, బాలింతలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం సరైన విధంగా పంపిణీ కాకపోవడం,కొన్ని కేంద్రాలు కేవలం సరుకుల పంపిణీ సమయంలో మాత్రమే తెరుచుకోవడం,పిల్లల హాజరు తక్కువగా ఉండటం, విద్యా కార్యక్రమాలు జరగకపోవడం,పౌష్టికాహార సరఫరాలో నాణ్యత లోపాలు, కొంతమంది లబ్ధిదారులకు సరైన మోతాదులో అందకపోవడంఈ విషయాలపై ప్రజల నుంచి నిరంతరం ఫిర్యాదులు మా దృష్టికి వస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ సూపర్వైజర్లు, సిడిపిఓలు సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్లనే పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. అందువల్ల వెంటనే పై అధికారులు స్పందించి అంగన్వాడి కేంద్రాల్లో క్రమశిక్షణ తీసుకురావాలని, సమయపాలన కచ్చితంగా అమలు చేయించాలని, బాధ్యతలలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని అన్నారు.లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గారికి మరియు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారికి అధికారికంగా ఫిర్యాదు అందజేసి, అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కరణం నరేష్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్ నాయుడు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పూనా మల్లికార్జున, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండి మల్లికార్జున, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి మాలేఖర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



## భూసార పరీక్షల ద్వారా పంట దిగబడి పెరుగుతుంది



**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం:** వేసవిలో భూసార పరీక్షలు చేసుకుంటే సాగు చేసిన పంట దిగుబడులు పెరుగుతాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం డి ఆర్ పి ఎం అండ్ యాప్ మోడల్ పై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులు పాటు ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో విజయవంతంగా నిర్వహించామని ఈ శిక్షణలో ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత మట్టి సారాన్ని సహజంగా పెంపొందించే విధానాలను సూక్ష్మజీవుల సంరక్షణ పంటల స్థిరమైన నిర్వహణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఉపయోగపడే డిఆర్పియం మరియు యాప్ మూన్ మోడల్ పై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ మోడల్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచడం నేలలోని తేమను ఎక్కువ కాలం నిలువు చేసుకోవడం చెట్లు పంటల పెరుగుదల అనుకూల వాతావరణాన్ని కల్పించడం మట్టి సారాన్ని కాపాడడం వంటి విషయాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వేసవిలో లోతొక్కులు చేస్తే ఏరు పురుగు ను నివారించవచ్చు అన్నారు.ఈ వేసవిలో ప్రకృతి ఎరువులు, కషాయాలు తయారు చేసుకోవచ్చన్నారు.రానున్న ఖరీఫ్ సీజన్లో వీటిని ఉపయోగించవద్దన్నారు. పంట మార్పిడి వల్ల భూమి సారవంతమై మంచి దిగుబడులు వస్తాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజకుమారి ప్రకృతి వ్యవసాయ అధికారులు ఆర్ఎస్కే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి మహోత్సవం

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** స్థానిక మెయిన్ బజార్ లో వున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరీ దేవి ఆలయం (అమ్మవారిశాల)లో నేడు అమ్మవారి జయంతి మహోత్సవం జరుగుతుందని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి మహాప్రాకార ప్రదక్షిణాలు, తదుపరి చండీహోమం, పంచామృతాభిషేకం, సహస్ర నామ కుంకుమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి జరుగుతుందని వివరించారు. కావున భక్తులు ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి శ్రీ వాసవిమాత అనుగ్రహం పొందాలని కోరారు. తదుపరి సాయత్రం 6.30కి శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపివిరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానాధీశులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ స్వహస్తములతో స్వర్ణ శ్రీచక్ర మేరువునకు (102 మంది సువాసినులతో) శ్రీ లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన, మహా మంగళ హారతి, ఆశీర్వచనం స్వామి వారి చేతుల మీదుగా జరుపబడునని తెలిపారు.

## నిలిచిన ఇంధన సరఫరా.. బంకుల వద్ద బారులు తీరిన వాహనాలు



**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపల్లిలో పెట్రోల్ డీజిల్ కొరత ప్రజలను వినియోగదారులను వేధిస్తోంది. లక్కిరెడ్డిపల్లి లోని అనేక బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. జిల్లా కేంద్రం నుండి డీజిల్ పెట్రోల్ సరఫరా కాకపోవడం బంకు యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోలు, డీజిల్ బుక్ చేసిన తర్వాత నాలుగు నుండి ఐదు రోజులకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని యజమానులు తెలుపుతున్నారు. పెట్రోల్ బంకుల ఎదుట వాహనదారులు క్యూ కట్టారు. పెట్రోల్ డీజిల్ కొరత వస్తుందన్న అనుమానంతో వాహనదారులు ఎగబడి క్యాన్లలో సైతం వినియోగదారులు పెట్రోలు నింపుకొని వెళ్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి డీజిల్ పెట్రోల్ కొరతలేకుండా చూడాలని పెట్రోల్ బంక్ యజమానులు వినియోదారులు ప్రజలు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆర్ ఎస్ ఆర్ క్రికెట్ అకాడమీ సమ్మర్ క్యాంప్‌ను
## ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి



**కడప - సూర్య వాస్తవం:** కడప నగరంలోని 19వ డివిజన్, పీఎఫ్ ఆఫీస్ ఎదురుగా ఉన్న సందులో ఆర్ ఎస్ ఆర్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్రికెట్ శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి మరియు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి సందర్శించి ప్రారంభించారు. కడపలోని యువ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని ఉత్తమ క్రికెటర్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంప్‌లో క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను వారు పరిశీలించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా వారు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు, క్రీడాకారులకు తమ పూర్తి ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు.

## నాగరికతకు దూరంగా నివసిస్తున్న గిరిజనులకు
## పాదరక్షలు పంపిణీ చేసిన వివేకానంద ఫౌండేషన్




**కాశినాయన - సూర్య వాస్తవం :** నల్లమల అడవులకు సమీపంగా నేటికీ నాగరికత, పరిశుభ్రత తెలీకుండా జీవిస్తున్నారు ఈ కాలనీ వాసులు. కడప జిల్లా కాశినాయన మండలంలోని వరికుంట్ల సమీపంలో జ్యోతి క్షేత్రం పరిసరాల్లో నల్లమల కొండలకు దగ్గరగా నివసిస్తున్నారు గిరిజన తెగకు చెందిన నలభై కుటుంబాలు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కోసం వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి శనివారం పాదరక్షలు, సబ్బులు, బ్రెష్ లు మరియు పేస్టులు పంపిణీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ శరీరాన్ని మరియు పరిసరాలను శుభ్రంగా ఉంచడం మన బాధ్యత అన్నారు. అందరూ చదువుకొని సమాజం లోని అందరి లాగ గౌరవంగా జీవించాలని, అందుకోసం వివేకానంద ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు కుందారపు గురుమూర్తి, కర్నాటి మద్దిరెడ్డి, చంద్రశేఖర్ ఆచారి, జయరాం, హరి తదితరులు పాల్గొన్నారు.

## విలేకరులు నా తోబుట్టువులు కంటే ఎక్కువ



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం ;** విలేకరులు నాకు తోబుట్టువులు కంటే ఎక్కువ అని కొత్తపల్లె మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆయన ఆయిల్ మిల్లులో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తాను ఓ విలేఖరి పై ఎస్పీ కి ఫిర్యాదు చేశానని మాట్లాడారని, కానీ గతంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆ విలేఖరిని బెదిరిస్తే తానే ధైర్యం చెప్పానని, అదేవిధంగా అతన్ని వారు ఏదైనా చేసి ఆ నెపం నాపైన నెడతారనే ఉద్దేశ్యంతోనే తాను ఎస్పీ ని కలిశానని వివరించారు. గతంలో వైసీపీ అధికారంలో వున్న సమయంలో ఎంతోమంది విలేఖరులను మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, పార్టీ శ్రేణులు ఎలాంటి పదజాలంతో దూషించారో, ఎలాంటి బెదిరింపులు చేశారో గుర్తు చేసుకోవాలని సూచించారు. తనపై వైసీపీ వారు పదేపదే బురద జల్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్తపల్లి పంచాయతీ ప్రజలు, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వద్ద తనకు చెడ్డ పేరు తేవాలని చూడటం వారి అవివేకమన్నారు. ఇకనైనా ఇటువంటి అసత్యాలు మానుకోవాలని సూచించారు.

### అక్షర సేద్యమే కాదు...ఆపన్న హస్తం ఆయన నైజం...
# వృద్ధుల గూడు కష్టాన్ని చూసి చలించి...
### రూ. 2 లక్షలతో సొంత ఇల్లు కట్టించిన మూలపల్లి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరాచారి...



**కాశినాయన - సూర్య వాస్తవం :** సాధారణంగా ఉపాధ్యాయులను 'అక్షర రూప శిల్పులు' అంటారు. కానీ ఆయన అంతకు మించి 'మానవత్వపు శిఖరం' అనిపించుకుంటున్నారు. పేదరికం గుమ్మం ముందు దీనంగా పడి ఉన్న వృద్ధుల జీవితంలో ఆయన వెలుగులు నింపారు. కాశినాయన మండలం బాలయ్యపల్లె గ్రామంలో ఉన్నటువంటి రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం ఎంబడి బాలనాగమ్మ మరియు ఓబయ్య ది వీరికి నలుగురు సంతానం ఉన్నప్పటికీ అందరూ వివాహాలు చేసుకొని ఎవరి జీవితాలు వాళ్ళు చూసుకున్నారు. ఈ వృద్ధ దంపతులు ఇద్దరూ ఒక పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు వానకాలం వస్తే లోపల అంతా వర్షపు మడుగే. ఓబయ్యకి వృద్ధాప్యం రీత్యా ఆయాసం, మోకాళ్ళ నొప్పులు పలు రకాల జబ్బులతో ఇబ్బంది పడుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న మూలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖరాచారి ప్రభుత్వ పథకాల కోసం వేచి చూడకుండా, మానవత్వమే పరమావధిగా భావించి ఆయన తక్షణమే స్పందించారు. తన కష్టార్జితం నుండి సుమారు రూ. 2 లక్షలు వెచ్చించి, ఆ వృద్ధ దంపతులకు అన్ని వసతులతో కూడిన పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చి, నిఖార్సైన మానవత్వానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచారు మూలపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరాచారి. కేవలం ఇల్లు కట్టించడమే కాదు నిరుపేద విద్యార్థులకు అండగా నిలవడం, పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం వంటి మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొంటున్నారు. "పదవిలో ఉన్నప్పుడు సంపాదించుకోవడం కాదు పదిమందికి సహాయం చేయడమే నిజమైన తృప్తి" అని నమ్మే చంద్రశేఖరాచారి ఉదారతను చూసి గ్రామస్థులు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేటి సమాజంలో స్వార్థం పెరిగిపోతున్న తరుణంలో, ఒక ఉపాధ్యాయుడిగా ఆయన చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి. గతంలో ఇదే ఉపాధ్యాయుడు నరసాపురంలో పక్షవాతం సోకిన శ్రీదేవికి రెండు లక్షల రూపాయలతో గూడును, అదేవిధంగా నరసాపురం కి చెందిన షుగర్ వ్యాధి గ్రస్తులు గోసాల సుబ్బమ్మ కూడా 50వేల రూపాయలతో మరుగుదొడ్డిని, తన మూలపల్లి పాఠశాలలో చదువుతున్న విద్యార్థి తమ్ముడు వెంకట సాయి హర్షకి తలలో గడ్డ ఆపరేషన్ కి 50 వేల రూపాయలు సహాయ కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మూలపల్లి ప్రదానోపాధ్యాయుడు చంద్రశేఖరాచారి మాట్లాడుతూ "వృత్తి రీత్యా నేను ఉపాధ్యాయుడిని పిల్లలకు పాఠాలు చెప్పడం ఎంత బాధ్యతో, సమాజంలో కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం కూడా అంతే బాధ్యత అని నేను నమ్ముతాను. బాలాయపల్లిలో ఆ వృద్ధ దంపతుల పరిస్థితి చూసినప్పుడు నా మనసు కలిచివేసింది. వయసు మళ్లిన కాలంలో, తల దాచుకోవడానికి సరైన నీడ లేక వారు పడుతున్న ఇబ్బందులు ఏ ఒక్కరినైనా కదిలిస్తాయి. ప్రభుత్వ సాయం వస్తుందని ఎదురుచూస్తూ కూర్చుంటే ఆ వృద్ధుల కష్టం ఇంకా పెరుగుతుంది. అందుకే, దేవుడు నాకు ఇచ్చిన ఈ జీతంలో నుంచే కొంత వెచ్చించి ఆమెకు ఒక గూడు కల్పించాలని నిర్ణయించుకున్నాను. రూ. 2 లక్షలు ఖర్చయినా పర్వాలేదు అనుకొని ఆ వృద్ధులు సురక్షితంగా ఒక ఇంట్లో నిద్రపోతున్నారు అనే తృప్తి నాకు చాలు అనుకోని వాళ్లకు ఆ ఇల్లు నిర్మించాను. నిజానికి నేను చేసిన ఈ పని గొప్పదేమీ కాదు. మన చుట్టూ ఉన్నవారు కష్టాల్లో ఉన్నప్పుడు మనకు తోచిన సాయం చేయడం మనిషిగా మన కనీస ధర్మం. నా విద్యార్థులకు కూడా నేను ఇదే చెబుతుంటాను 'చదువుతో పాటు సంస్కారం, సాటి మనిషిపై జాలి ఉండాలి' అని. నా వంతుగా ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందు కూడా కొనసాగిస్తాను అని ఆయన అన్నారు.

### పి ఆర్ టి యు- ఏపీ
# ధర్నా విజయవంతం చేసినందుకు ధన్యవాదములు






**కడప - సూర్య వాస్తవం:** విజయవాడ నందు ధర్నా చౌక్ లో జరిగిన పి ఆర్ టి యు ధర్నా కార్యక్రమం లో దాదాపు ఐదు వేల మంది ఉపాధ్యాయుల తో ధర్నా కార్యక్రమం శనివారం పి ఆర్ టి యు రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు పాల్గొని ప్రసంగించారు. పి ఆర్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.ఎం. గిరి ప్రసాద్ పాల్గొని సంఘ నిర్మాణం పట్ల సంఘ అవశ్యకత పట్ల సవివరంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు పాల్గొని పి ఆర్ టి యు రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్ తన ప్రసంగం లో 2003 ఉపాధ్యాయుల కు కచ్చితంగా ప్రభుత్వం తో చర్చించి ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో అతి త్వరలో వారి కి జిఓ ఇప్పించే బాధ్యత పి ఆర్ టి యు - ఏపీ రాష్ట్ర శాఖ తీసుకుంటుందని 2004 తరువాత రాష్ట్ర ము లో నియామకాలు పొందిన దాదాపు 4 లక్షల పైగా ఉన్న ఉద్యోగ ఉపాధ్యయు లు అందరికి ఒపీఎస్ సాధించేవరకు పి ఆర్ టి యు- ఏపీ ఎమ్మెల్సీ రాష్ట్ర శాఖ పనిచేస్తుందని తెలియజేసారు. సీపీఎస్ అంతం పి ఆర్ టి యు పంతం అని ధర్నా చౌక్ దద్దరిల్లే లా గుజ్జల తిరుపాల్ నినదించారు .దాదాపు 5 బస్సు లలో వై ఎస్ ఆర్ కడప జిల్లా నుంచి రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండి విశ్వనాథ్ రెడ్డి , మోపూరి వెంకట శివారెడ్డి ల ఆధ్వర్యంలో 200 మంది నాయకులు కార్యకర్త లు పాల్గొని విజయవంతం చేసినందుకు రాష్ట్రము లోని 28జిల్లా ల నుండి పాల్గొన్న ప్రతి పి ఆర్ టి యు కుటుంబ సభ్యునికి, కార్యకర్త కు, మండల, జిల్లా, రాష్ట్ర బాధ్యులకు, శ్రేయోభిలాషులకు, పత్రిక సంపాదకులకు, విలేకరుల కు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వారికీ ప్రత్యేక ఉద్యమాభి వందనాలు తెలియజేసారు.

# ఒక్కసెంటు భూమినైనా ఆక్రమించే ఉంటే దేనికైనా సిద్ధం
### వైసీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి

**కడప - సూర్య వాస్తవం:** తాను ఎక్కడైనా ఒక్క సెంటు డీకేటీ భూమి ఆక్రమణ చేసుంటే దేనికైనా సిద్ధమేనని వైసీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మీదే కదా ఉన్నది నేను ఎక్కడ అన్యాయంగా ప్రభుత్వ భూమినైనా, ఎవరిదైనా ప్రైవేట్ వ్యక్తుల భూమి అయినా ఆక్రమించింటే నిరూపించాలని సీఎం చంద్రబాబునాయుడుకు సవాల్ విసిరారు. పెద్ద దస్తగిరి మా వాడేనని, నాకు మంచి అనుచరుడు, వ్యాపారస్తుడని అన్నారు. వైసీపీ అంటే ప్రేమతో పార్టీ కోసం కృషి చేసేవాడని, అతని హత్యకు మేము కుట్రపన్నుతామా నీచమైన వ్యాఖ్యలు మీకు సరికాదన్నారు. మావాడు చనిపోయి మేము బాధపడుతుంటే మంచి అనుచరుణ్ణి కోల్పోయాన్నే అని మేము చింతనతో ఉన్నామన్నారు. మాపై అనవసరంగా నిందలు వేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రయేయం ఉన్నట్లు నిరూపించాలని, అధికారంలో మీరే ఉన్నారు కదా నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యం.వి.రామచంద్రారెడ్డి, పులిసునీల్, లక్ష్మీనారాయణ రెడ్డి వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



# అలాంటి ప్రపంచాన్ని ఎప్పుడూ చూడలేదు

## - 'టాక్సిక్' పై రుక్మిణీ వసంత్



టాక్సిక్' సినిమా స్కేల్ తాను ఎప్పుడూ చూడని స్థాయిలో ఉందన్న రుక్మిణీ వసంత్ యశ్, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ కలిసి ఓ కొత్త ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని వెల్లడి ఈ సినిమాకు ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో చూడాలని ఆసక్తిగా ఉందన్న నటి యశ్, నయనతార, కియారా అద్వానీ వంటి భారీ తారాగణంతో 'టాక్సిక్' “కాంతార: ఏ లెజెండ్ చాప్టర్ 1” చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణీ వసంత్, ప్రస్తుతం యశ్ హీరోగా నటిస్తున్న “టాక్సిక్: ఏ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్” సినిమాలో నటిస్తున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన ఆమె, ఈ సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమా భారీతనం, తెరపై ఆవిష్కరించబోతున్న ప్రపంచం గురించి ఆమె వివరించారు.

ఈ సినిమా రేంజ్ చాలా పెద్దదని, తానిప్పటి వరకు ఇంత భారీ చిత్రాన్ని చూడలేదని రుక్మిణీ అన్నారు. “దీని స్కేల్ నేను ఇప్పటివరకు చూడని స్థాయిలో ఉంది” అని ఆమె పేర్కొన్నారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్, హీరో యశ్ కలిసి ఓ సరికొత్త ప్రపంచాన్ని నిర్మిస్తున్నారని ఆమె ప్రశంసించారు. “మా డైరెక్టర్ గీతూ, స్టార్ యశ్ నిర్మిస్తున్న ప్రపంచం చాలా విస్తృతమైనది, కొత్తది. ఇది నాకు చాలా మార్గదర్శకంగా అనిపిస్తోంది. ఈ కొత్త ప్రపంచానికి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను” అని ఆమె తెలిపారు.

కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషీ, రుక్మిణీ వసంత్, అక్షయ్ ఒబెరాయ్ వంటి భారీ తారాగణం ఉంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, మలయాళం, హిందీతో పాటు పలు అంతర్జాతీయ భాషల్లో విడుదల చేయనున్నారు.

“టాక్సిక్” సినిమాతో పాటు, రుక్మిణీ వసంత్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' (పేరు పరిశీలనలో ఉంది) చిత్రంలో కూడా నటిస్తున్నారు. మరికొన్ని ప్రాజెక్టులు కూడా ఆమె చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది.

# 'గాయపడ్డ సింహం'

## ట్రైలర్ మైండ్ బ్లోయింగ్..



నటుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న న్యూ-ఏజ్ ఎంటర్‌టైనర్ 'గాయపడ్డ సింహం'. ఇందులో జేడీ చక్రవర్తి కీలకపాత్ర పోషించారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 1న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ శనివారం అట్టహాసంగా థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన పాన్ ఇండియా స్టార్ దుల్కర్ సల్మాన్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉందని, సినిమా పెద్ద విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ట్రైలర్ ఆద్యంతం వినోదం, వ్యంగ్యం, భావోద్వేగాల మేళవింపుతో ఆకట్టుకుంది. అమెరికాలో స్థిరపడాలని కలలు కన్న ఓ యువకుడు, డొనాల్డ్ ట్రంప్ కఠిన ఇమిగ్రేషన్ పాలసీల వల్ల తిరిగి ఇండియాకు రావాల్సి వస్తుంది. తన కలలు చెదిరిపోవడంతో నిరాశకు గురైన అతను, తనదైన శైలిలో ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడనే అంశాన్ని దర్శకుడు డార్క్ హ్యూమర్‌తో చూపించారు. తరుణ్ భాస్కర్ తన సహజ నటనతో ఆకట్టుకోగా, ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడీ చక్రవర్తి నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో, శ్రీ విష్ణు ప్రత్యేక పాత్రలో కనిపించడం విశేషం.

ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, “'గాయపడ్డ సింహం' టైటిల్ విన్నప్పటి నుంచే ఆసక్తి కలిగింది. ట్రైలర్ మైండ్ బ్లోయింగ్ గా ఉంది. ప్రతి విజువల్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. అమెరికా వెళ్లాలని చాలా మంది కలలు కంటారు, కాబట్టి ఈ కథ అందరికీ కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా తప్పకుండా బిగ్ సమ్మర్ బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్ముతున్నాను” అని అన్నారు. ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, “నాలుగు రోజుల క్రితం సినిమా చూశాను. చాలా మంచి కాన్సెప్ట్. సినిమా చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉన్నాను. సెకండ్ హాఫ్‌లోని ఐదు ఎపిసోడ్స్ థియేటర్‌లో బాగా ఎంటర్‌టైన్ చేస్తాయి. అవి వర్కవుట్ అయితే ఇది మరో జాతిరత్నాలు అవుతుంది” అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ చిత్రానికి పవన్ సాదినేని సమర్పకుడిగా వ్యవహరిస్తుండగా, సప్తస్వ మీడియా వర్క్స్, పీఓవీ స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్లపై కల్యాణ చక్రవర్తి, భాను కిరణ్, విజయ్ కృష్ణ, ఉమేష్ బన్సల్ నిర్మించారు. స్వీకర్ అగస్తి సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో జేడీ చక్రవర్తి, ఫరియా అబ్దుల్లా, దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్, నిర్మాతలు, ఇతర చిత్ర బృందం పాల్గొని సినిమా విజయంపై విశ్వాసం వ్యక్తం చేశారు.



# ఇషాన్, అభిషేక్ విధ్వంసం...

## రాజస్థాన్ పై సన్‌రైజర్స్ సంచలన విజయం

- రాజస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్
- వైభవ్ సూర్యవంశీ విధ్వంసక శతకంతో రాజస్థాన్ భారీ స్కోర్
- భారీ లక్ష్య ఛేదనలో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ మెరుపు అర్ధశతకాలు
- 18.3 ఓవర్లలోనే 229 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన హైదరాబాద్



ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వరద పారించిన మరో ఉత్కంఠభరిత మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ సంచలన విజయం సాధించింది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం అందుకుంది. తొలుత రాజస్థాన్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (103) విధ్వంసక శతకంతో చెలరేగగా, రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 228 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం సన్‌రైజర్స్ బ్యాటర్లు ఇషాన్ కిషన్ (74), అభిషేక్ శర్మ (57) మెరుపు అర్ధశతకాలతో లక్ష్యాన్ని చిన్నదిగా మార్చేశారు. 229 పరుగుల భారీ లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు కేవలం 18.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

229 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తొలి ఓవర్‌లోనే ట్రావిస్ హెడ్ (6) వికెట్ కోల్పోయి షాక్ తగిలింది. అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఎదురుదాడికి దిగాడు. వీరిద్దరూ రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశారు. పవర్ ప్లే ఓవర్లను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. అభిషేక్ శర్మ 29 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 57 పరుగులు చేయగా, ఇషాన్ కిషన్ కేవలం 31 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 74 పరుగులు చేశాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు కేవలం 55 బంతుల్లోనే 132 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేసింది. వీరిద్దరూ ఔటయ్యాక, హెన్రిచ్ క్లాసెన్ (29), నితీష్ కుమార్ రెడ్డి (18 బంతుల్లో 36) కీలక ఇన్నింగ్స్‌లు ఆడి జట్టును విజయానికి చేరువ చేశారు.

చివరి ఓవర్లలో ఒత్తిడి పెరిగినా, సలీల్ అరోరా (3 బంతుల్లో 8 నాటౌట్) ఒక సిక్సర్ కొట్టి మరో 9 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, బ్రిజేష్ శర్మ చెరో రెండు వికెట్లు తీశారు. వైభవ్ అద్భుత శతకం వృథాగా మిగిలింది.


ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే యశస్వి జైస్వాల్ (10) రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 37 బంతుల్లోనే 5 ఫోర్లు, ఏకంగా 12 సిక్సర్లతో 103 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు.

అతనికి మరో ఎండ్‌లో ధ్రువ్ జురెల్ (35 బంతుల్లో 51) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. చివర్లో డొనోవన్ ఫెరీరా (16 బంతుల్లో 33) కూడా మెరుపులు మెరిపించడంతో రాజస్థాన్ భారీ స్కోరు నమోదు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో కమిన్స్ పొదుపుగా బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయగా, ఇషాన్ మలింగ రెండు వికెట్లు పడగొట్టాడు.

# ఏమన్నా బ్యాటింగా ఇది...

**ఐపీఎల్ లో రికార్డు ఛేజింగ్... 265 పరుగుల టార్గెట్ ఉఫ్!**

- ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించి పంజాబ్ కింగ్స్ రికార్డు
- 265 పరుగుల భారీ టార్గెట్‌ను 18.5 ఓవర్లలోనే పూర్తి చేసిన పంజాబ్
- ప్రభ్‌సిమ్రాన్, శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకాలతో జట్టు విజయంలో కీలక పాత్ర
- ఢిల్లీ తరపున కేఎల్ రాహుల్ అద్భుత శతకం (152) నమోదు
- ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో పరుగుల వర్షం కురిపించిన ఇరు జట్లు



ఐపీఎల్ చరిత్రలో ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. టీ20 క్రికెట్‌లో అత్యంత కష్టసాధ్యం అనుకున్న లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ అసాధారణ బ్యాటింగ్ తో ఛేదించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 265 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యధిక పరుగుల విజయవంతమైన ఛేదనగా రికార్డులకెక్కింది. ప్రభ్‌సిమ్రాన్ సింగ్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అద్భుత అర్ధ శతకాలతో పంజాబ్ చారిత్రక విజయం సాధించింది.

అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ నిర్దేశించిన 265 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన పంజాబ్ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (26 బంతుల్లో 76; 9 ఫోర్లు, 5 సిక్సర్లు), ప్రియాన్ష్ ఆర్య (17 బంతుల్లో 43; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 6.5 ఓవర్లలోనే 126 పరుగులు జోడించి విజయానికి బలమైన పునాది వేశారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో పంజాబ్ 116 పరుగులు రాబట్టి ఢిల్లీ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టింది. ఓపెనర్లు వెనుదిరిగిన తర్వాత కూడా పంజాబ్ జోరు తగ్గలేదు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 71 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) బాధ్యతాయుతమైన, విధ్వంసకర ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. కూపర్ కానలీ (17), నేహాల్ వధేరా (25) కూడా తమ వంతు సహకారం అందించారు. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్ చివరి వరకు క్రీజులో నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివర్లో శశాంక్ సింగ్ (10 బంతుల్లో 19 నాటౌట్)తో కలిసి మరో వికెట్ పడకుండా లాంఛనాన్ని పూర్తి చేశాడు. దీంతో పంజాబ్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 265 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది.

# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

**- జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా**



**కడప బ్యూరో -సూర్య వాస్తవం :** జిల్లాలో పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఆయిల్ కంపెనీ డిపోల నందు ప్రజల రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా ఆయిల్ కంపెనీ సేల్స్ అధికారులు, పౌర సరఫరా అధికారులు, పెట్రోలియం డీలర్లతో సమావేశము నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... జిల్లాలోని మొత్తం పెట్రోల్ బంకులలో (ఐఓసీ-65, బీపీసీఎల్-58, హెచ్పీసీఎల్-92, నయారా-14, రిలియన్స్ జియో-5) ఉన్నాయని తెలియజేశారు. ప్రైవేటు రంగ సంస్థలకు చెందిన బంకులలో పెట్రోలు/డీజిలు ధరలు పెరగడము వలన సదరు బంకుల్లో అధిక శాతం డీజిల్ విక్రయాలు తగ్గిపోయాయని, సదరు వినియోగదారులంతా ప్రభుత్వ రంగ సంస్థల బంకులకు వస్తున్నారన్నారు. దీంతో వినియోగం పెరిగడంతో గతంలో కాంట్రాక్టర్లు, ఇతర బల్క్ వినియోగదారులు గతంలో నేరుగా ఆయిల్ కంపెనీ నుండి డీజిల్ కొనుగోలు చేసేవారు ప్రస్తుతం ధరలు పెంచడము వలన ఇప్పుడు వారంతా ప్రభుత్వ రంగ డీలర్ల నుంచి డీజిల్ కొనుగోలు చేస్తున్నారన్నారు. పరిశ్రమల అవసరాలకు సరఫరా చేసే డీజిల్ ధర లీటరుకు రూ.152 వరకు చేరింది. దీంతో వీరు కూడా ప్రభుత్వ రంగ బంకుల్లోనే డీజిల్ కొంటున్నారు. పెట్రోలు కొరత లేదని కాని భయంతో వాహనదారులు అవసరానికి మించి కొనుగోలు చేస్తు న్నారు అధికశాతం మంది ఫుల్ ట్యాంక్ చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు ఎవరూ ఇంధన కొరత వస్తుందని ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఆందోళనతో అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అపోహలకు లోనుకాకుండా ప్రజలు ఎప్పట్లాగే తమ సాధారణ వినియోగాన్ని కొనసాగించాలని కోరారు. ఒకవేళ ఎక్కడైనా బంకుల్లో ఇంధనం తక్కువైతే వెంటనే అక్కడ నిల్వలు అందుబాటులోకి తెచ్చేలా త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇందు కొరకు డీలర్లు కూడా టోల్ ఫ్రీ నెంబరు 1967 కు ఫోను చేసి నిల్వలు అయిపోయిన విషయలో ప్రభుత్వ దృష్టి తీసుకొని రావచ్చునని తెలియజేశారు. డీలర్లు పెట్రోల్, డీజిల్ అనవసరంగా కొనుగోలు చేసి నిల్వలు దాచిపెట్టి, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయిలో ట్ కలెక్టర్ తేల్చి చెప్పారు. అలాగే కడప జిల్లాలో పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ఆయిల్ కంపెనీ డిపోల నందు ప్రజల రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు.

# లక్ష్యానికి చేరువలో మలేరియా రహిత సమాజం

**- నక్కల దిన్నె ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ పి ఓబులేసు**




**చాపాడు - సూర్య వాస్తవం :** మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో జరుపుకు న్నామని వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులేసు మాట్లాడుతూ ఈ సంవత్సరం "ఇప్పుడు మనం సాధించగలం, ఇప్పుడు మనం తప్పక సాధించాలి" అనే నినాదంతో ముందుకు వెళ్లాలని, అలాగే నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామాలలో గత 2022 వ సంవత్సరం నుండి ఇప్పటివరకు ఒక్క మలేరియా కేసు కూడ నమోదు కాలేదని, ఒకటి, డెంగ్యూ కేసు నమోదు అయిన వెంటనే నివారణ చర్యలు చేపట్టి, అలాగే వర్షాలు దృష్టిలో పెట్టుకొని క్రిమి సంహారక మందులు పిచికారి చేయడం వల్ల దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వీలు అవుతుందని ఆయన వెల్లడించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మలేరియా జ్వరాలు, దాని ప్రభావం, తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలలో అవగాహన కల్పించడం, ఆసుపత్రిల్లో ఉన్న వైద్య సేవల వినియోగం తెలియచేసేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కి విశదీకరించారు. సిబ్బంది చేత చిన్న ప్రాణం - పెద్ద ప్రమాదం, దోమ కాటు - పెను ముప్పు, నెట్ కట్టు- దోమ పట్, మలేరియా రహిత సమాజమే మన అందరి బాధ్యత, ప్రతి శుక్రవారం - ఒక శుబ్రవారం కావాలి. అరికడదాం అరికదాం - దోమల వ్యాప్తిని అరికడదాం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డ్రైడే ఫ్రైడే రోజున ఎయిర్ కూలర్స్, ఓవర్ హెడ్ ట్యాంక్స్, మురుగు కాల్వలు, ఇవి అన్ని శుభ్రం చేయడం వల్ల దోమలను నివారించ వచ్చని ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం. రాఘవయ్య ,సూపర్ వైజర్ భవానీ, యం ఎల్ హెచ్ పి లు, ఎ ఎన్ యం లు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సిబ్బంది మహిళలు పట్ల గౌరవ ప్రదంగా మెలగాలి

**- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



**కుప్పం - సూర్య వాస్తవం :**ఆర్టీసీ సిబ్బంది మహిళలు పట్ల గౌరవ ప్రదంగా మెలగాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు.శనివారం కుప్పం ఆర్టీసీ డిపోలో కార్మికులు ఉద్యోగులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనసభ లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం ఏపీఎస్ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లు మరియు గ్యారేజ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సుల్లో ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించడం, మహిళా ప్రయాణికులతో గౌరవంగా మాట్లాడడం, దివ్యాంగులకు ప్రత్యేక శ్రద్ధతో సహాయం అందించడం వంటి అంశాలపై ఆయన సిబ్బందికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అలాగే బస్ స్టాండ్లను శుభ్రంగా ఉంచడం, బస్సులు సకాలంలో నడపడం, తరచుగా రిపేర్ సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, డ్రైవర్లు మరియు కండక్టర్లు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎం రాముకుసూచించారు.ఏపిఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ

ముఖ్యమంత్రి ఆలోచనల ప్రకారం "శ్రీ శక్తి -- దివ్యాంగుల శక్తి" భావనతో ప్రతి దివ్యాంగ ప్రయాణికుడికి సౌకర్యవంతమైన మరియు గౌరవప్రదమైన సేవలు అందించడం మనందరి బాధ్యత అని తెలియజేశారు. అదేవిధంగా కుప్పం నియోజకవర్గంలో రూ.75 కోట్ల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కొత్త ఆర్టీసీ డిపో నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు.కుప్పం డిపో నిర్మాణానికి సింగపూర్ మరియు అమరావతి నమూనాలను రూపొందించిన నిపుణుల సహకారంతో ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నామన్నారు. అలాగే ఆ నిపుణులే ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం ఆధునిక నమూనా డిజైన్ను సిద్ధం చేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో కుప్పం డిపోకు ఆధునిక ఎలక్ట్రిక్ మరియు ఏసీ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో కుప్పం డిపోను నంబర్-1 డిపోగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రజలకు అత్యుత్తమ రవాణా సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలియజేశారు.పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు తో తనకు చాలా అవినాభావ సంబంధం ఉందన్నారు.తన చిన్నతనం నుండి పై చదువులకు ఆర్టీసీ లోనే ప్రయాణం చేసేవాడినని తెలిపారు.గతంలో ఆర్టీసీ బస్సు ను గ్రామాల్లో ప్రజలు తమ సొంతంగా భావించేవారని అన్నారు.ఆ వాతావరణం ఇప్పుడు కనబడే నందుకు బాధగా ఉందని అన్నారు.ఏపి ఎస్ ఆర్టీసీ ఆర్ ఎం రాము మాట్లాడుతూ సిబ్బందికి గౌతమ బుద్ధుడి కి ఉన్నంత సహనం ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ వి సెల్వరాజు, కౌన్సిలర్ లు జాకీర్, సురేష్, నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కుప్పం ఆర్టీసీ డిపో డిఎం టికె స్వామి, ఆర్టీసీ డ్రైవర్లు సిబ్బంది, పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రతపై అవగాహన

**- ఆపదలో ఉన్న మహిళల భద్రత, రక్షణ కోసం రూపొందించిన యాప్ స్త్రీరక్ష పోర్టల్**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన చేశారు. ముఖ్యంగా స్త్రీరక్ష పోర్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంట్లో నుంచే నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసికెళ్లి పరిష్కరించుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. శక్తి యాప్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన చేశారు. ఆపదలో ఉన్న మహిళల భద్రత, రక్షణ కోసం ప్రభుత్వం ఈ యాప్ ను రూపొందించిందని, మహిళలు తమ సెల్ ఫోన్లలో యాప్ డౌన్లోడ్ చేసుకుని ఎలా రక్షణ పొందవచ్చో తెలియజేశారు. అంతేకాకుండా... నేరాల జోలికెళ్లరాదని... అక్రమ మద్యం, మట్కా, పేకాట, గుట్కా, తదితర చట్టవ్యతిరేక కార్యపాల జోలికెళ్లొద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి - అనర్థాలపై చైతన్యం చేశారు.

## మున్సిపల్ ఇంజనీర్, కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో నాణ్యతలేని రోడ్డు, డ్రైనేజీ పనులు



**మైదుకూరు -సూర్య వాస్తవం :** మున్సిపల్ ఇంజనీర్, కాంట్రాక్టర్లు కుమ్మక్కై మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు , డ్రైనేజీ పనులు నాణ్యత లేకుండా చేస్తున్నారని ప్రజలకు సౌకర్య వంతమైన మౌలిక వసతులు కల్పించడం లేదని రైతు సేవాసమితి కడప జిల్లా అధ్యక్షుడు ఏవి.రమణ ఆరోపించారు. శనివారం మైదుకూరు పట్టణం ఎనిమిదవ డివిజన్ కడప రోడ్డులోని శారద విద్యా మందిర్ స్కూల్ ఎడమ పక్కవీధిలో ఆరు నెలల క్రితం రోడ్డు, డ్రైనేజీ కాలువ పనులు నాణ్యత లేకుండా, డ్రైనేజీ కాలువ ఎత్తుపల్లాలు లేకుండా చేయడంతో డ్రైనేజీ మురికినీరు రోడ్డుపైన కాలవలోనే నిల్వ ఉండడంతో వీధి ప్రజలు రైతు సేవా సమితి నాయకత్వానికి తెలియజేయడంతో రైతు సేవాసమితి మైదుకూరు పట్టణ నాయకత్వం ఆధ్వర్యంలో సమస్యను పరిశీలించడం జరిగిందని రమణ తెలిపారు. పనులు జరుగుతున్న ప్రాంతంలో మున్సిపల్ ఇంజనీర్ పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత లేకుండా పనులు జరుగుతుండడంతో పనులు చేసి కూడా ప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు కలగడం లేదని మైదుకూరులో జరుగుతున్న, జరిగిన ఈ రోడ్లు, డ్రైనేజీ వర్కుల పైన కడప జిల్లా కలెక్టర్ స్పందించి మైదుకూరు పట్టణంలో జరిగిన అవినీతిపనులపైన విచారణ జరిపి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకొని పట్టణప్రజలకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు కల్పించాలని ఏవి. రమణ కడప జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదుకూరు పట్టణ అధ్యక్షుడు కానగూడూరు రామ్మోహన్, సమితి సభ్యులు మూలే సుబ్బారెడ్డి, సైమన్, మాల కొండయ్య, వీధి ప్రజలు పోలూరు హరి, నాగరత్నం, సుబ్బమ్మ, నాగేశ్వరితదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన ఆర్టీఐ నాయకులు బోనం వెంకటేష్



**కడప క్రైం - సూర్య వాస్తవం:** సమాచార హక్కు చట్టం కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనంవెంకటేష్ (శిలాస్) శనివారం కడప జిల్లా సూపరిడెంట్ ఆఫ్ పోలీస్ షెల్కె సచికేత్ విశ్వనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం కడప జిల్లాలో జరుగుతున్న పరిణామాలను బట్టి ఆయనతో చర్చిస్తూ శాంతి భద్రతలను అదుపులో ఉంచుతూ సామాన్య ప్రజానీకానికి తక్షణ సాయం అందేలా నమ్మకం కల్పిస్తూ అన్ని పోలీస్ స్టేషన్ లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా న్యాయం చెయ్యాలని ఎస్పిని కోరారు. శాంతిభద్రతలను అదుపులో ఉంచుతూ జిల్లా స్థాయిలో నేర ప్రవృత్తిని తగ్గిస్తూ అత్యంత సమర్థంగా విధులు నిర్వహిస్తున్న రాని కొనియాడారు.ప్రత్యేకించి రౌడీషీటర్ల బారి నుండి, మత్తుపదార్థాలకు, గంజాయి కి అలవాటు పడిన యువతను పరిరక్షించే విషయంలో ఎస్పీ చూపుతున్న నిబద్ధతను బోనం శిలాస్ కొనియాడారు ఇంకా ఎక్కడైతే నిర్లక్ష్యపు ధోరణితో ముందుకు సాగుతున్న సిబ్బందిని సామాన్య ప్రజానీకానికి సహకరించేలా విధులు నిర్వర్తించేలా మరియు ఆన్ లైన్ సేవలు కారక్టర్ సర్టిఫికెట్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఇతరత్రా ధ్రువ పత్రాలు మంజూరు చేసే క్రమంలో జాప్యం లేకుండా త్వరిత గతిన అప్రూవల్ చేసేలా జిల్లా పరిధిలో ఉన్న అన్నిపోలీస్ స్టేషన్లకు ఆయన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad )

# ఓటర్ మ్యాపింగ్‌పై అవగాహన సదస్సు

## వెంకటగిరి నియోజకవర్గంలో మ్యాపింగ్ పురోగతి ఆశాజనకం




**వెంకటగిరి, సూర్య వాస్తవం ఏప్రిల్ 24:** వెంకటగిరి నియోజకవర్గంలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఎలక్ట్రోరల్ రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఓటర్ మ్యాపింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నియోజక వర్గ పరిధిలోని డక్కిలి తహసీల్దార్ ఎం శ్రీనివాసులు, ఎన్నికల ఉప తహసీల్దార్ లు సూపర్వైజర్లు పాల్గొన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఓటర్ మ్యాపింగ్ పనులు ఆశించిన స్థాయికి చేరుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఓటర్ మ్యాపింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఓటరును సరైన పోలింగ్ కేంద్రానికి అనుసంధానం చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని వివరించారు. ప్రత్యేకంగా పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇంటింటి సర్వేను కచ్చితంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను సమగ్రంగా సేకరించి, ఎటువంటి లోపాలు లేకుండా డేటాను నవీకరించాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ, పనితీరు మెరుగుపరచడానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి ఎస్ ఐ ఆర్ మ్యాపింగ్‌ను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యమని, ప్రజల సహకారం లేకుండా ఈ ప్రక్రియ పూర్తి కాదని అన్నారు. సదస్సులో పాల్గొన్న అధికారులు తమ తమ మండలాల్లో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు భరత్ నాయక్ అందించారు. త్వరలోనే పూర్తి స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేసి ఎన్నికల నిర్వహణను సజావుగా చేపట్టాలని నిర్ణయించారు.

### అధికారం శాశ్వతం కాదు..

# నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు

### ఆక్కుల గారి విజయ్ వ్యాఖ్యలపై వైసీపీ నాయకులు మండిపాటు



**పులివెందుల సూర్య వాస్తవం:** అక్కులగారి విజయ్,నువ్వు చెప్పినట్లు మీకు సిగ్గు ,మానం ,శరం ,లజ్జ అనేది ఉంటే , మాట మీద నిలబడే రకం అయితే కుటుంబ సమస్య లో వ్రేలు పెట్టి పదే పదే షర్మిలమ్మ గురించి ప్రస్తావన తెచ్చే బీటెక్ రవికి ఏదో కోస్తా, తీస్తా అని ప్రగల్భాలు పలుకగలవా అని వైసిపి నాయకులు ధ్వజమెత్తారు శనివారం పులివెందల జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూమీ నాయకుడు శ్రీ రామచంద్రుడో లేక సొంత అన్నదమ్ములైన పాండవులను మోసం చేసిన దుర్యోధనుడో మరికొంత కాలానికి మీకే తెలుస్తుంది,మాట తప్పని, మడమ తిప్పని, నీతివంతమైన పరిపాలన అలనాటి శ్రీ రామ చంద్రుడి లక్షణాలైతే, అధికారం కోసం అబద్ధాలు చెప్తూ ప్రజలని మభ్యపెడుతూ, అక్రమ సంపాదన కోసం జూదం,బెట్టింగ్,ఇసుక మాఫియా లాంటి అడ్డదారులు తొక్కుతూ, వాటిని కాపలా కాసే వారికి గన్ మెన్ లను ఇచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే దుశ్శాసుడిని శ్రీరామచంద్రుడిగా పోల్చడం హాస్యాస్పదం ,మీ పార్టీ ని స్థాపించిన ఎన్టీరామారావు సొంత రక్తం పంచుకు పుట్టిన జూనియర్ ఎన్టీఆర్ ను మీ పార్టీ ఎమ్మెల్యే అమ్మ నా బూతులు తిట్టినప్పుడు నీ రోమాలు నిక్కబొడుచుకోలేద,ప్రెస్ మీట్ లో హుందాగా మాట్లాడాలనే ఇంగిత జ్ఞానం కూడా లేని సంస్కార హీనులతో, వైయస్ కుటుంబం కాలి గోటి మట్టికి కూడా సరితూగని వారి కి ఇంతకంటే ఏమి సమాధానం చెప్పగలం,అధికారం అనేది శాశ్వతం కాదు అని కర్మ సిద్ధాంతం అనేది ఒక్కటి ఉంటుంది అని ఈ రోజు మాట్లాదిన ప్రతి పదానికి సమాధానం చెప్పే రోజు వస్తుంది అని , ఈ విషయాలన్నీ గుర్తు పెట్టుకొని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. ఈకార్యక్రమం లో వైసీపీ నాయకులు రమేష్, సుదర్శన్,ఈశ్వరయ్య,కార్తీక్, విజయ్, ఖలంధర్ తదితరులు పాల్గొన్నారు...

### ప్రభుత్వ భూములను

# కాజేసేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే

### మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** ప్రభుత్వ భూములను అధికారులు కాపాడాలని, లేదంటే తానే గాంధేయ మార్గంలో పోరడతానని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కోరారు. శనివారం స్థానిక దొరసానిపల్లె లోని ఆయన నివాసంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ఒకటవ వార్డు బొల్లవరంలో దేవదేవుడు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి సమీపంలో వున్న 9 ఎకరాల 68 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన కుమారుడు నంద్యాల కొండారెడ్డి కాజేసే యత్నం చేస్తున్నారని, ఇందుకోసం వారు అక్రమ మార్గంలో ఇప్పటికే అన్ని రకాల చర్యలు తీసుకున్నారని తెలియజేశారు. గతంలో బొల్లవరం ప్రాంతానికి చెందిన బద్వేలి సత్యనారాయణ రెడ్డికి చెందిన ఈ భూమి దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ కారణంగా 1970లో ఆయన కున్న 42 ఎకరాలలో ఈ ఎకరాల 68 సెంట్ల భూమి ప్రభుత్వానికి చెందిందని, దాని బొల్లవరం, దొరసానిపల్లె, చౌటపల్లె, తదితర ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది రైతులకు వ్యవసాయం చేసుకునే నిమిత్తం తాత్కాలిక డికేటీ క్రింద అందజేసి, సంవత్సరానికి దాదాపు 490 రూపాయలు పన్ను చెల్లించేలా, నిబంధనలు అతిక్రమిస్తే రద్దు చేసేలా నిబంధనలు రూపొందించారని, కానీ వారు వ్యవసాయం చేయక పోగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కారణంగా రామేశ్వరానికి చెందిన వ్యక్తులకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. కాగా పట్టణ ప్రజలు కలెక్టర్ కు విషయం తెలపగా ఆయన విచారణకు ఆదేశించగా, విచారణలో అది వాస్తవమేనని తేలడంతో విచరణాధికారి నివేదిక సమర్పించారని తెలిపారు. కాగా తర్వాత తాత్కాలిక డికేటీ పొందిన వారే కోర్టును ఆశ్రయించి శాశ్వత డికేటీ కావాలని కోరగా, కోర్టు కలెక్టర్ వివరణ, నిబంధనల ఉల్లంఘన, అందుబాటులో వున్న జీవోల ప్రకారం డికేటీ ఇవ్వమని తీర్పు ఇచ్చారని వివరించారు. కాగా ప్రస్తుతం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి దొరసానిపల్లె కు చెందిన టిడిపి నాయకులు మునివర, చౌటపల్లె టిడిపి నాయకులు లక్ష్మిరెడ్డి తో కలిసి అక్రమ మార్గంలో ఈ భూమిని కాజేసేందుకు పథకం ఆలోచించి, డబ్బు సమకూర్చుకొని, ఎమ్మెల్యే బందువైన న్యాయవాది ద్వారా వివరాలు సేకరించి ఆ భూమిని కాజేసేందుకు కుట్ర పన్నారని వివరించారు. కావున అధికారులు వారి చర్యను అడ్డుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. తన ఆరోపణలు అవాస్తవమేతే ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి పత్రికా ముఖంగా ప్రమాణ పూర్వకంగా తెలపాలని సవాల్ విసిరారు. ఈ భూమి అన్యాక్రాంతాన్ని అడ్డుకునేందుకు తాను గాంధేయ మార్గంలో పోరాడతానని స్పష్టం చేశారు. అదేవిధంగా ఒక బాధితురాలు తన ఆవేదనను తెలిపితే ఒక యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేసినందుకు ఆ యూట్యూబ్ ఛానల్ విలేఖరిపై కొత్తపల్లి మాజీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అక్రమంగా కేసు బనాయించడం సరికాదన్నారు. పోలీసులు ఇటువంటి చర్యలకు సహకరించరాదని సూచించారు. జర్నలిస్టులపై బెదిరింపులు, తప్పుడు కేసులు భావ్యం కాదని తెలిపారు

### బీసీ వర్గాల అభివృద్ధి,

# సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తా

### ప్రోత్సహించిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు



**పులివెందుల సూర్య వాస్తవం:** రాష్ట్ర బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు గాను నా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేయడం జరుగుతుంది మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ బాధ్యతను నాకు అప్పగించిన మా ప్రియతమ నాయకుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి, వైయస్ అవినాష్ రెడ్డి కి, వైయస్ భాస్కర్ రెడ్డి కి,వైఎస్ మనోహర్ రెడ్డి కి, వైయస్ మదన్ మోహన్ రెడ్డి కి, దుష్యంత్ రెడ్డి కి, దేవిరెడ్డి శంకర్ రెడ్డి కి,సతీష్ రెడ్డి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, బీసీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తాను. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నా వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తాను. ముఖ్యంగా బీసీ వర్గాల హక్కులు, అవకాశాల కోసం మరింత శ్రమిస్తాను. నన్ను ప్రోత్సహించిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందనిరాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీసీ విభాగం వరప్రసాద్ తెలిపారు.

## భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి శుభాకాంక్షల వెల్లువ

**పులివెందుల సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి శుభాకాంక్షల వెల్లువతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ని మోపురి దేవస్థాన చైర్మన్ మరియు ఇతర ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన నివాసంలో కలిసిన ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. రామగోపాల్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి రమణారెడ్డి (మోపురి దేవస్థాన చైర్మన్) ఓబుల్ రెడ్డి శ్రీనివాస రెడ్డి, ఓబుల్ రెడ్డి కృష్ణారెడ్డి, అన్నారెడ్డి చంద్రారెడ్డి,అన్నారెడ్డి బాలగంగి రెడ్డిమరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జనగణన అవగాహన 2కె రన్ కార్యక్రమం

## విజయవంతానికి కృషి చేయండి



**పులివెందుల సూర్య వాస్తవం:** భారత జనగణన - 2027 కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేపు నేడు ఆదివారం పులివెందుల పట్టణంలో 2కె రన్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి ముని కుమార్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. నేటి ఉదయం 7:00 గంటల నుండి 9:00 గంటల వరకు,?గాంధీ సర్కిల్ నుండి ప్రారంభమై పూల అంగళ్ల మీదుగా పాత బస్టాండ్ సమీపంలోని వైఎస్ఆర్ సర్కిల్ వరకు ఈ రన్ కొనసాగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు, జనగణన ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు,స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పులివెందుల పురపాలక సంఘం కమిషనర్ కోరారు. ఈ అవగాహన కార్యక్రమానికి విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.


## భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి శుభాకాంక్షల వెల్లువ





**పులివెందుల సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి శుభాకాంక్షల వెల్లువతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ని మోపురి దేవస్థాన చైర్మన్ మరియు ఇతర ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన నివాసంలో కలిసిన ప్రముఖులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. రామగోపాల్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి రమణారెడ్డి (మోపురి దేవస్థాన చైర్మన్) ఓబుల్ రెడ్డి శ్రీనివాస రెడ్డి, ఓబుల్ రెడ్డి కృష్ణారెడ్డి, అన్నారెడ్డి చంద్రారెడ్డి,అన్నారెడ్డి బాలగంగి రెడ్డిమరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సూచనల మేరకు చిన్న శెట్టిపల్లె గ్రామ వైసీపీ నాయకులు మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డికి రాష్ట్రస్థాయి హోదాలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి శనివారం తమ అనుచరులతో కలిసి స్థానిక దొరసానిపల్లెలోని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నివాసంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.